MAHANAGAR DINAPATRIKA

మహానగర్


విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 269 | పేజీలు : 8 | శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

- ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు
- వేగంగా పెరుగుతున్న మౌలిక వసతులతో లాజిస్టిక్స్, తయారీ రంగాలకు కొత్త బలంగా మారింది
- భారత్‌లో తయారవుతున్న చిప్‌లు దేశంతో పాటు ప్రపంచ మార్కెట్లకు చేరుతున్నాయి

5



దేశ అభివృద్ధి అజెండాలో జాతీయ భద్రత చాలా కీలకం

- ఉగ్రవాదం విషయంలో భారత్ ఇక కేవలం ఖండనలకే పరిమితం కాదు- దీటుగా బదులిస్తోంది
- దేశ భద్రత, సరిహద్దు సవాళ్ల విషయంలో కీలక వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించి ఇకపై భారత్ కేవలం దౌత్యపరమైన ఖండనలకే పరిమితం కాదని వెల్లడి
- దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీ నాయకత్వం నిజంగా చరిత్రాత్మకం

మోదీకి అండగా నిలుద్దాం



ఎన్డీయే ఐక్యతే దేశానికి బలం.. మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి

నదుల అనుసంధానం, సాంకేతిక అభివృద్ధితో దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి

అయోధ్యలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 10 ఎకరాలు కేటాయించాలి

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

వారణాసి, మహానగర్

రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోదీకి అండగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్డీయే ఐక్యతే దేశానికి బలమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, ప్రజాజీవితంలో 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్యూవారం నిర్వహించిన 'వారణాసి--వడ్నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మోదీ నాయకత్వంలో దేశంలో సంక్షేమం, సాంకేతికత, మౌలిక వసతులు, పారిశ్రామిక రంగాల్లో మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. 'వీకేఎస్'ను అభివృద్ధి మంత్రంగా అభివర్ణిస్తూ వడ్నగర్, కాశీ, సెప్టెంబర్‌ను ప్రస్తావించారు. పేదరిక నిర్మూలన, ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, తాగునీటి సౌకర్యం, రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ వంటి అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. కోవిడ్ సమయంలో భారత్ వ్యాక్సిన్ల ఉత్పత్తి, ఇతర దేశాలకు సరఫరా వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావిస్తూ మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ విధానాలను వివరించారు. రక్షణ రంగంలో దిగుమతుల నుంచి ఎగుమతుల దిశగా భారత్ ముందుకు సాగుతోందని, అంతరిక్షం, డ్రోన్లు, సెమీకండక్టర్లు, క్వాంటమ్ సాంకేతికత, రోబోటిక్స్ వంటి రంగాల్లో యువతకు అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. మహిళా సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రస్తావించారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సామర్థ్యాన్ని చాటిందని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొన్న అనుభవాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ గ్రిడ్, రవాణా అనుసంధానం, వందే భారత్ రైళ్ల వంటి అంశాలను ప్రస్తావిస్తూ బ్రహ్మపుత్ర, గంగా, మహానది, కావేరి, గోదావరి నదుల అనుసంధానం జరిగితే భారత్ మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం పూర్తికావడం చారిత్రక పరిణామమని పేర్కొంటూ, త్రేతాయుగ దైవమైన శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో కలియుగ దైవమైన - మిగతా2లో

140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నాం

- అమెరికా ఆంక్షల బిల్లు ఆమోదంపై భారత్
- రష్యాపై ఆంక్షల బిల్లుకు ఆమోదంపై స్పందించిన భారత్
- ఆ బిల్లు గురించి తమకు అవగాహన ఉందన్న కేంద్ర విదేశాంగ శాఖ



5

ఎల్‌నినో ఎఫెక్ట్ కాదు.. ఎల్లో నినో ఎఫెక్ట్

- రాష్ట్రంలోని అన్ని జిల్లాలూ వర్షపాతం లోటులోనే ఉన్నాయి
- "688 మండలాల్లో దాదాపు 628 మండలాలు వర్షాభావ పరిస్థితుల్లో ఉన్నాయి
- దాదాపు 332 మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.
- "జూలై, ఆగస్టులో కూడా తీవ్ర వర్షపాతం లోటు కొనసాగినా కరువు కార్యాచరణ చేపట్టలేదు
- ప్రభుత్వ మాటలు నమ్మి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలకుపైగా నష్టపోయారు
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని.. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికిపైగా వర్షపాతం లోటు ఉందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇవాళ(గురువారం) తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శులు, రీజనల్ కో--ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో కరువు, వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడికి సంబంధించి జిల్లాల వారీగా స్థానిక పరిణామాలపై వైఎస్ జగన్ చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలూ వర్షపాతం లోటులోనే ఉన్నాయన్నారు. "688 మండలాల్లో దాదాపు 628 మండలాలు వర్షాభావ పరిస్థితుల్లో ఉన్నాయి. దాదాపు 332 మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అన్నమయ్య జిల్లాలో 75 శాతం వర్షపాతం లోటు. సత్యసాయి జిల్లాలో 66 శాతం, ప్రకాశం జిల్లాలో 65 - మిగతా2లో

అటు కరవు.. ఇటు వరదలు



- ఇంకిపోతున్న భూగర్భజలాలు
- ప్రపంచానికి నీటి గండం: డబ్ల్యూఎంఓ హెచ్చరిక
- భూమిపైన అన్ని ప్రధాన గ్లేసియర్స్ వేగంగా మంచును కోల్పోతున్నాయి
- ఐక్యరాజ్యసమితి డబ్ల్యూఎంఓ ఆందోళన
- కూడా అడుగంటిపోతున్నాయని స్పష్టం
- ఆసియా, ఆఫ్రికాల్లోనే పెను విపత్తులు సంభవిస్తున్నాయని హెచ్చరిక!

5

పోలవరం పూర్తి చేస్తాం.. ప్రజల నమ్మకాన్ని నిజం చేస్తాం

- పోలవరం పూర్తయి ఉంటే, ఎల్ నినోను ఎదుర్కొనే వాళ్లం
- నాడు వైసీపీ నేతలు ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో జాప్యం చేశారు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



పోలవరం

పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేస్తామనే నమ్మకాన్ని సీఎం చంద్రబాబు ప్రజలకు కల్పించారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. గురువారం ఆయన క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ హయాంలో ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పలేకపోయారు. అప్పట్లో వాళ్లు పనులను త్వరితగతిన పూర్తి చేసి ఉంటే ఇప్పుడు ఎల్‌నినోను ఎదుర్కొని ఇలాంటి క్లిష్ట సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 400 టీఎంసీలు నీటిని వినియోగించుకుని, రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలు తీర్చుకోగలిగే వాళ్ళం అని అన్నారు. ప్రస్తుతం ఈసిఆర్ఎఫ్ డ్యామ్ కు సంబంధించి గ్యాప్--1 నిర్మాణ పనులు 49 శాతం, గ్యాప్--2 పనులు 43 శాతం పూర్తి - మిగతా2లో

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం

- ఇద్దరు అనుమానిత జైషే మహమ్మద్ ఉగ్రవాదులు హతం
- సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- మిగిలిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల గాలింపు కొనసాగింపు



5

వినూత్న హెచ్ఆర్ విధానాలతో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియాకు గుర్తింపు

చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ జ్వా నామ్ కిమ్‌కు అత్యంత ప్రభావవంతమైన హెచ్ఆర్ నాయకుడి అవార్డు



విజయవాడ

బెంగళూరులో జరిగిన 25వ ఆసియా పసిఫిక్ హెచ్ఆర్ఎం కాంగ్రెస్ అవార్డ్స్--2026లో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకుంది. నాయకత్వ అభివృద్ధి, సంస్థాగత సామర్థ్యాల పెంపు, కార్యాలయ సంస్కృతి, ఉద్యోగుల అనుభవం, ప్రతిభా వికాసం వంటి విభాగాల్లో వినూత్న మానవ వనరుల విధానాలను అమలు చేసినందుకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియాకు 'వినూత్న హెచ్ఆర్ విధానాలతో అత్యుత్తమ సంస్థ'గా గుర్తింపు లభించింది. సంస్థ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ జ్వా నామ్ కిమ్‌కు హెచ్ఆర్ రంగంలో మార్పులను ముందుకు నడిపించడం, వ్యాపార వృద్ధికి ఉద్యోగులను వ్యూహాత్మక శక్తిగా తీర్చిదిద్దడంలో చూపిన నాయకత్వానికి 'మోస్ట్ ఇంపాక్ట్‌ఫుల్ హెచ్ఆర్ లీడర్' అవార్డును ప్రదానం చేశారు. ఈ గుర్తింపు సంస్థలోని ప్రతి ఉద్యోగికి చెందుతుందని జ్వా నామ్ కిమ్ తెలిపారు. హెచ్ఆర్ విధానాలను వ్యాపార రూపాంతర కార్యక్రమాలతో అనుసంధానిస్తూ, ఉద్యోగులు మరియు సంస్థ కలిసి అభివృద్ధి చెందేందుకు అవసరమైన నాయకత్వం, సామర్థ్యాలు, సంస్థాగత సంస్కృతిని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ఇండియా, మేక్ ఇండియా గ్లోబల్' వ్యూహానికి అనుగుణంగా మానవ వనరులు, సంస్థాగత సామర్థ్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా 2024, 2025 సంవత్సరాల్లో వరుసగా గ్రేట్ ప్లేస్ టు వర్క్ ధ్రువీకరణను పొందింది. వరల్డ్ హెచ్ఆర్‌డీ కాంగ్రెస్ నుంచి జాతీయ ఉత్తమ ఉద్యోగదాత బ్రాండ్ అవార్డు--2026ను కూడా అందుకుంది. జ్వా నామ్ కిమ్‌కు అత్యుత్తమ హెచ్ఆర్ ఐకానిక్ లీడర్ అవార్డు లభించింది. ఉద్యోగుల అభ్యాసం, సామర్థ్యాభివృద్ధికి చేసిన కృషికి మోస్ట్ ఇన్నోవేటివ్ ఎల్అండ్‌డీ ప్రోగ్రామ్ అవార్డు--2026తో పాటు హెచ్ఆర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి హెచ్ఆర్ డిస్టింక్షన్ డైమండ్ గుర్తింపును సంస్థ అందుకుంది. ఈ అవార్డులు సమ్మిళిత, చురుకైన, అధిక పనితీరు కనబరిచే పని వాతావరణాన్ని నిర్మించడంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా కొనసాగిస్తున్న కృషికి గుర్తింపుగా నిలిచాయి.

కామినేనిలో ఐవస్ సాంకేతికత.. రెండు క్లిష్టమైన కేసుల్లో విజయవంతంగా చికిత్స

- **కామినేనిలో అందుబాటులోకి యాంజియోప్లాస్టీకి ఇంట్రావాస్క్యులర్ అల్ట్రాసౌండ్ (ఐవస్)**
- **బ్లాకేజ్ తీవ్రత, రక్తనాళాల పరిస్థితిని కచ్చితంగా అంచనా వేసేందుకు అత్యాధునిక సాంకేతికత**
- **కామినేని హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎన్ పవన్ కుమార్**



విజయవాడ, మహానగర్

గుండె రక్తనాళాల్లోని బ్లాకేజ్‌ను మరింత కచ్చితంగా అంచనా వేయడంతో పాటు యాంజియోప్లాస్టీ సమయంలో సరైన పరిమాణంలో స్టెంట్‌ను ఎంపిక చేసి, అది రక్తనాళంలో సరిగ్గా అమర్చబడిందో లేదో నిర్ధారించేందుకు ఇంట్రావాస్క్యులర్ అల్ట్రాసౌండ్ (ఐవస్) అత్యంత ఉపయోగకరమైన అత్యాధునిక వైద్య సాంకేతికత అని కామినేని హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎన్ పవన్ కుమార్ తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని హోటల్ ఇంద్రప్రస్థలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాధారణ యాంజియోగ్రామ్ ద్వారా కనిపించే సమాచారంతో పాటు రక్తనాళం లోపలి పరిస్థితిని మరింత స్పష్టంగా తెలుసుకునేందుకు 'ఐవస్' సహాయపడుతుందని వివరించారు. ముఖ్యంగా బ్లాకేజ్ ఎంత మేరకు ఉంది, రక్తనాళం పరిమాణం ఎంత ఉంది, బ్లాకేజ్ తీవ్రత ఎలా ఉంది, రక్తనాళం గోడల్లో కాల్షియం ఎంతమేర పేరుకుపోయింది వంటి అంశాలను అంచనా వేయడంలో 'ఐవస్' ఉపయోగపడుతుందన్నారు. ఈ సమాచారంతో యాంజియోప్లాస్టీ సమయంలో సరైన చికిత్సా విధానాన్ని నిర్ణయించుకోవడంతో పాటు, అవసరమైన స్టెంట్ పరిమాణాన్ని ఎంపిక చేయడానికి కూడా వైద్యులకు సహాయపడుతుందని తెలిపారు. ఇటీవల 85 ఏళ్ల వృద్ధుడు గుండెపోటుతో కామినేని హాస్పిటల్‌కు వచ్చారని, పరీక్షల్లో గుండె రక్తనాళంలో సుమారు 99 శాతం బ్లాకేజ్ ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఆ బ్లాకేజ్ చాలాకాలంగా ఉండటంతో రక్తనాళంలో కాల్షియం చాలా గట్టిగా పేరుకుపోయి, రాయిలా మారిన పరిస్థితి కనిపించిందన్నారు. ఇలాంటి క్లిష్టమైన బ్లాకేజ్‌లో కాల్షియం ఎంత మందంగా ఉంది, రక్తనాళం లోపలి పరిస్థితి ఎలా ఉంది, బ్లాకేజ్ అసలు తీవ్రత ఎంత అనే అంశాలను కచ్చితంగా తెలుసుకోవడం చికిత్సకు కీలకమని చెప్పారు. 'ఐవస్' సహాయంతో రక్తనాళం లోపలి పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి తదనుగుణంగా చికిత్స అందించినట్లు వివరించారు. మరో కేసులో నాలుగేళ్ల క్రితం అమర్చిన స్టెంట్‌లోనే తిరిగి బ్లాకేజ్ ఏర్పడిన రోగికి 'ఐవస్' సహాయంతో చికిత్స అందించినట్లు తెలిపారు. గతంలో వేసిన స్టెంట్ ఎందుకు బ్లాక్ అయింది, స్టెంట్ రక్తనాళంలో సరిగ్గా విస్తరించిందా, స్టెంట్ చుట్టూ తిరిగి బ్లాకేజ్ ఏర్పడటానికి కారణాలు ఏమిటనే అంశాలను ఐవస్ ద్వారా విశ్లేషించగలిగామని చెప్పారు. రక్తనాళం లోపలి పరిస్థితిని ప్రత్యక్షంగా అంచనా వేసిన తర్వాత అవసరమైన చికిత్సను నిర్ణయించినట్లు తెలిపారు. క్లిష్టమైన గుండె బ్లాకేజ్‌లలో కేవలం యాంజియోగ్రామ్ ఆధారంగా కాకుండా, అవసరమైన సందర్భాల్లో ఐవస్ వంటి ఇంట్రావాస్క్యులర్ ఇమేజింగ్ సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా రోగి పరిస్థితిపై మరింత స్పష్టమైన అవగాహన పొందవచ్చని డాక్టర్ పవన్ కుమార్ పేర్కొన్నారు. బ్లాకేజ్ స్వభావం, రక్తనాళం పరిమాణం, కాల్షియం స్థాయి, స్టెంట్ ఎంపిక, స్టెంట్ అమరిక వంటి అంశాలను కచ్చితంగా అంచనా వేసి చికిత్స అందించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. ఈ తరహా క్లిష్టమైన కేసుల్లో రోగి పరిస్థితిని సమగ్రంగా తెలుసుకుని చికిత్స చేయడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. కామినేని హాస్పిటల్స్‌లో ×ఎఖూ వంటి అత్యాధునిక సాంకేతికతతో పాటు అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు అందుబాటులో ఉన్నారని ఆయన తెలిపారు. అవసరమైన రోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుండె సంబంధిత క్లిష్టమైన సమస్యలకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో కామినేని హాస్పిటల్స్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రేమాల అర్చన, కామినేని క్లస్టర్ హెడ్ పి. సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ కె. ఆర్. రమణారావు పాల్గొన్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్ కాదు.. ఎల్లో నినో ఎఫెక్ట్

-**మొదటిపేజీ తరువాయి**

శాతం వర్షపాతం లోటు.

..చిత్తూరులో 58.5 శాతం, వైఎస్సార్ కడపలో 57 శాతం వర్షపాతం లోటు. తూర్పుగోదావరిలో 57 శాతం, మార్కాపురం--నంద్యాలలో 56 శాతం చొప్పున వర్షపాతం లోటు. విశాఖపట్నంలో 54 శాతం, అనంతపురంలో 51 శాతం వర్షపాతం లోటు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఫిబ్రవరిలోనే తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదు" అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

"జూలై, ఆగస్టులో కూడా తీవ్ర వర్షపాతం లోటు కొనసాగినా కరువు కార్యాచరణ చేపట్టలేదు. ప్రభుత్వ మాటలు నమ్మి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలకుపైగా నష్టపోయారు. సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైంది. దాదాపు 20 లక్షల ఎకరాల్లో విత్తనం కూడా పడలేదు. సాగు చేసిన ప్రాంతాల్లో కూడా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంటను బట్టి రైతులు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోయారు. కంది, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, వరి సహా అనేక పంటలు దెబ్బతిన్నాయి

పండ్ల తోటలు కూడా కరువు దెబ్బకు ఎండిపోతున్నాయి. శ్రీశైలం నీటిని సరైన సమయంలో రాయలసీమకు మళ్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తీసుకునే అవకాశం ఉన్నప్పుడు చర్యలు తీసుకోలేదు. తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్ పరిధిలోని రిజర్వాయర్లను ముందుగానే నింపాల్సింది. పులిచింతల వద్ద తెలంగాణ చేపడుతున్న లిఫ్ట్‌లపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. పోలవరం పూర్తి సామర్థ్యంపై ప్రభుత్వం రాజీపడుతోంది. పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా నీరు అందించే అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. పుష్కర, పురుషోత్తపట్నం లిఫ్ట్‌ల పేరుతో ప్రచారం కాకుండా శాశ్వత సాగునీటి పరిష్కారంపై దృష్టిపెట్టాలి" అని వైఎస్ జగన్ సూచించారు.

"వరుస వర్షపాతం లోటు కనిపిస్తున్నా కరువు మండలాలను ఎందుకు ప్రకటించడం లేదు?. కరువు ప్రభావిత మండలాలను తక్షణమే అధికారికంగా ప్రకటించాలి. కరువు ప్రభావిత రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. రైతులకు ఉచిత పంటల బీమాను వెంటనే పునరుద్ధరించాలి. రైతుల నుంచి వసూలు చేసిన పంటల బీమా ప్రీమియాన్ని తిరిగి చెల్లించాలి. గతంలో రైతులకు రావాల్సిన రూ.3 వేల కోట్ల పంటల బీమా పరిహారాన్ని వెంటనే చెల్లించాలి. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.15 వేల పరిహారం ఇవ్వాలి. పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.25 వేల పరిహారం ఇవ్వాలి" అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

"ఉచిత పంటల బీమా కొనసాగి ఉంటే రైతులకు ్రాతీవజవత్‌వస ాశీషఱఅస్త్ర సహా బీమా రక్షణ ఉండేది. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రావాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లించాలి. అన్నదాత సుఖీభవ కింద మూడేళ్లలో రూ.60 వేలు ఇవ్వాలి. ఇచ్చింది కేవలం రూ. 19 వేలే. బకాయి పడ్డ రూ. 41 వేలు కూడా రైతులకు ఇవ్వాలి. కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులైన రైతులకు మూడేళ్లలో ఎగ్గొట్టిన రూ. 60వేలు ఇవ్వాలి. తుఫాన్ల వల్ల రైతులకు పెండింగ్‌లో ఉన్న పంటల బీమా పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలి. కరువు వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ప్రకటించాలి.

..ఇన్‌పుట్ సబ్సిడీ కింద సుమారు రూ. 6 వేల కోట్లు రైతులకు అందించాలి. సున్నా వడ్డీ పథకాన్ని తిరిగి అమలు చేయాలి. గత మూడు సంవత్సరాలకు సంబంధించిన సున్నా వడ్డీ బకాయిలన్నీ రైతులకు చెల్లించాలి. పశుగ్రాసాన్ని ముందుగానే సమీకరించి కరువు జిల్లా రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలి. కరువు కారణంగా వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అక్టోబర్ నుంచి మార్చి వరకు అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలి. కరువు ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కోసం కేంద్రాన్ని వెంటనే అదనపు పనిదినాలు కోరాలి.

కర్ణాటకలో సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్-2026 ప్రారంభం



విజయవాడ

కర్ణాటకలో కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో యువతకు నైపుణ్యాలను అందించేందుకు సామ్‌సంగ్ ఇండియా సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ (ఎస్ఐసీ)--2026 కార్యక్రమాన్ని ప్రారంభించింది. కర్ణాటక ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి సమక్షంలో ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక ఛాంబర్స్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన నృపతుంగ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా కర్ణాటకలో 2,000 మంది యువతకు పరిశ్రమకు అనుగుణమైన ఏఐ విద్య, ప్రాక్టికల్ శిక్షణ, నిపుణుల మార్గదర్శకత్వం అందించనున్నారు. 18--25 ఏళ్ల యువతకు హ్యాండ్స్‌ఆన్ ఏఐ, జనరేటివ్ ఏఐ శిక్షణతో పాటు వాస్తవ సవాళ్లకు పరిష్కారాలను రూపొందించే అవకాశాలు కల్పించనున్నారు. కర్ణాటకలో ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే 3,000 మందికి పైగా శిక్షణ పొందారు. దేశవ్యాప్తంగా 2025లో సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ద్వారా 20,000 మందికి పైగా శిక్షణ పొందగా, వారిలో మహిళల వాటా 48 శాతంగా ఉంది. 2026లో 10 రాష్ట్రాల్లో 20,000 మంది యువతకు శిక్షణ అందించాలన్న సామ్‌సంగ్ లక్ష్యంలో కర్ణాటక కార్యక్రమం భాగం. ఎలక్ట్రానిక్స్ సెక్టర్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఎస్ఎస్సీఐ), టెలికామ్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ (టీఎస్ఎస్సీ) సహకారంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు.

రెండు కీలక బీఐఎస్ ధృవీకరణలు సాధించిన ఏఎంఎన్ఎస్ ఇండియా



విజయవాడ

ప్రత్యేక ఉక్కు రంగంలో తన మార్కెట్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ అర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) రెండు కీలక భారతీయ ప్రమాణాల సంస్థ ధృవీకరణలను సాధించింది. తాజాగా ప్రవేశపెట్టిన ఐఎస్ 2062 (పార్ట్ 2):2026 ప్రమాణం కింద వేడి చుట్టిన క్వెంచ్డ్ అండ్ టెంపర్డ్ ఉక్కు ప్లేట్లు, షీట్లు, స్ట్రిప్స్, వైడ్ ఫ్లాట్స్ కోసం దేశంలోనే తొలి బీఐఎస్ లైసెన్స్ పొందిన ఉక్కు తయారీ సంస్థగా ఏఎంఎన్ఎస్ ఇండియా నిలిచింది. అలాగే ముందుగా రంగు పూసిన జింక్--అల్యూమినియం--మెగ్నీషియం మిశ్రమ పూత కలిగిన ఉక్కు స్ట్రిప్, షీట్ కోసం ఐఎస్ 19210:2025 ప్రమాణాల కింద బీఐఎస్ లైసెన్స్‌ను పొందింది. ఈ ధృవీకరణలు ప్రభుత్వ నిధులతో చేపట్టే మౌలిక సదుపాయాలు, రక్షణ, ప్రభుత్వ రంగ ప్రాజెక్టులకు దేశీయంగా ధృవీకరించబడిన ఉక్కు సరఫరాకు మార్గం సుగమం చేయనున్నాయి. క్వెంచ్డ్ అండ్ టెంపర్డ్ ఉక్కు అధిక బలం, మన్నికను కలిగి ఉండటంతో వంతెనలు, భారీ ఇంజినీరింగ్ పరికరాలు, గనుల యంత్రాలు, సముద్ర నిర్మాణాల్లో వినియోగించవచ్చు. జింక్--అల్యూమినియం--మెగ్నీషియం పూత కలిగిన ఉక్కు అధిక తుప్పు నిరోధకత, దీర్ఘకాలిక సేవా జీవితాన్ని అందిస్తుంది. హజీరా, పూణే కేంద్రాల్లో తయారయ్యే ఈ ఉత్పత్తులు దేశీయ అవసరాలను తీర్చడంతో పాటు దిగుమతి ప్రత్యామ్నాయానికి తోడ్పడనున్నాయి.

మోదీకి అండగా నిలుద్దాం

-**మొదటిపేజీ తరువాయి**

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనే ఆలోచన ఉందని, ఇందుకు 10 ఎకరాల స్థలం కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరినట్లు తెలిపారు. హిందీలో చంద్రబాబు చేసిన ప్రసంగానికి సభికుల నుంచి చప్పట్లు, హర్షధ్వానాలు లభించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చంద్రబాబు ప్రసంగాన్ని ప్రశంసిస్తూ సభికులు చప్పట్లతో అభినందించాలని కోరారు. కార్యక్రమానికి ముందు చంద్రబాబు, రాజ్‌నాథ్ సింగ్, యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరులతో కలిసి కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా సంకల్ప్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. వారణాసి నుంచి వద్నగర్‌కు చేపట్టిన ఈ సేవా యాత్ర ప్రధాని మోదీ జన్మదినం, ప్రజాజీవితంలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా కొనసాగుతోంది.

పోలవరం పూర్తి చేస్తాం.. ప్రజల నమ్మకాన్ని నిజం చేస్తాం

-**మొదటిపేజీ తరువాయి**

చేశాం. రైట్ కనెక్టివిటీస్ పనులు ఈ నెలాఖరు నాటికి, లెఫ్ట్ కనెక్టివిటీస్ పనులు నవంబర్ నాటికి పూర్తి కానున్నాయి. ఈసిఆర్ఎఫ్ డ్యామ్ పనులు 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యం పెట్టారు. రూ.536 కోట్లతో చేపట్టిన కుడి,ఎడమ గట్ల అనుసంధాన పనులు జరుగుతున్నాయి. 2024 జూన్ తరువాత 10,491 ఎకరాల భూసేకరణ చేసి, నిర్వాసితులకు 2,250 కోట్ల పరిహారాన్ని అందించాం. గత 5 ఏళ్ళ పాలనలో ఒక్క ఎకరం భూమి సేకరించలేదు, నిర్వాసితులకు ఒక్కరూపాయి పరిహారం అందించలేదు. కేంద్రం ఇచ్చిన 3850 కోట్ల రియంబర్స్‌మెంట్ నిధులను సైతం ప్రాజెక్టుకు గానీ, నిర్వాసితులకు గానీ ఖర్చుచేయకుండా దారిమళ్ళించారు. కూటమి ప్రభుత్వం ముందుగా చెప్పినట్లే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువలను పూర్తి చేసి నీళ్లు విడుదల చేసి దశాబ్దాల కల నెరవేర్చాం. రానున్న 3 ఏళ్లలో 35 వేల కోట్లు ఖర్చు చేసి 36 ప్రాజెక్టులు పూర్తి చేయాలని చంద్రబాబు లక్ష్యం పెట్టారు. వచ్చే 3 ఏళ్ళు ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల పండుగలను తీసుకొస్తాం అని మంత్రి వెల్లడించారు.

కొండ ప్రాంత ప్రజల సంక్షేమానికి భరోసా

- పునరావాసం, భద్రత, జీవన ప్రమాణాలు, గృహ వసతులపై ప్రత్యేక దృష్టి
- సవాళ్లను అధగమించి సుస్థిర సమాజ నిర్మాణం వైపు ముందడుగు
- మేధోమథనానికి వేదికగా ఎస్‌పీఏలో ప్రత్యేక సమావేశం



విజయవాడ, మహానగర్

నగరంలోని కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల క్షేమం, సంక్షేమం, జీవన ప్రమాణాల మెరుగుదల, పునరావాసం, పట్టణ గృహ వసతులపై సమగ్ర కార్యాచరణతో ముందడుగు వేయాలని ప్రముఖులు పిలుపునిచ్చారు. ప్రజలకు సురక్షితమైన, సుస్థిరమైన నివాస వసతి కల్పించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. గురువారం నగరంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) సమావేశ మందిరంలో ఎస్‌పీఏతో పాటు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ-హైదరాబాద్), జిల్లా అధికార యంత్రాంగం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి చొరవతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఏఎస్‌సీఐ డైరెక్టర్ జనరల్ డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, చెన్నై స్మార్ట్ సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజు, ఎస్‌పీఏ డైరెక్టర్ డా. రమేష్ సిరికొండ తదితరులు హాజరైన ఈ సమావేశంలో తొలుత ధ్యానచంద్ర హెచ్ఎం నగరంలోని ఇంద్రకీలాద్రి హిల్, విన్సీపేట హిల్, గుణదల హిల్, గాంధీ హిల్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు, కల్పిస్తున్న సౌకర్యాలు, వర్షాలు, వరదల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇటీవల కాలంలో చోటుచేసుకున్న ప్రమాదాలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 192 మైక్రో పాకెట్ల పరిధిలో దాదాపు రెండు లక్షల జనాభాకు కల్పిస్తున్న తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ప్రాథమిక మౌలిక వసతుల కల్పనతో పాటు జీవన ప్రమాణాల మెరుగుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. చినుకుపడితే చాలు కొండప్రాంతాల్లోని 48 సున్నిత ప్రాంతాల్లో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న భయాందోళన పరిస్థితులకు చెక్ పెట్టేందుకు ఓ గొప్ప ముందడుగు పడాల్సిన ఆవశ్యకతను సమావేశంలో ప్రముఖులు ఉద్ఘాటించారు. సవాళ్లను ఎదుర్కొంటూ నగరాన్ని ఆదర్శ నగరంగా నిలబెట్టేందుకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. ఏదైనా రాత్రికి రాత్రే సాధ్యపడదు.. ప్రజల భద్రత, సంక్షేమం, జీవన ప్రమాణాలకు సంబంధించిన కీలక అంశాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళిక, అన్ని శాఖల సమన్వయం, దశలవారీ కార్యాచరణ అవసరమని.. ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ముందుకు సాగుతామని, తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే స్థిరమైన పరిష్కారం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందుకు ఆధునిక సాంకేతికత, వనరుల సమర్థ వినియోగం, అర్బన్ హౌసింగ్ వినూత్న ప్రణాళికలు వంటివి దోహదం చేస్తాయన్నారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి మొదలయ్యే కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ సాఫ్టెటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

మానసిక ఒత్తిడిని అధిగమిస్తే సమర్థవంతంగా విధి నిర్వహణ

ఉద్యోగుల కోసం ప్రతి గురువారం ఉచిత మానసిక ఆరోగ్య సెషన్స్

జిల్లా కలెక్టర్ చొరవతో ఆకర్ష ఫౌండేషన్ భాగస్వామ్యంతో కార్యక్రమం



విజయవాడ, మహానగర్

ఉద్యోగ విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ చొరవతో ప్రత్యేక మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం జిల్లా క్యాంపు కార్యాలయంలో ఉద్యోగుల కోసం ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు ఎదుర్కొనే పని ఒత్తిడిని గుర్తించడం, నియంత్రించడం, మానసిక సమస్యలను అధిగమించడం, పని--వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత పాటించడం వంటి అంశాలపై నిపుణులు అవగాహన, కౌన్సెలింగ్ అందించారు. ఈ కార్యక్రమానికి 'ఆకర్ష ఫౌండేషన్' భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వెంకటశంకర్ రావు ఆధ్వర్యంలో సుమారు 150 మంది సైకాలజిస్టుల బృందం ఉచిత మానసిక ఆరోగ్య సేవలు, కౌన్సెలింగ్ అందిస్తోంది. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికత, పని విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. మార్పుకు భయపడకుండా కొత్త విషయాలను నేర్చుకోవడం, కొత్త అవకాశాలను స్వీకరించడం, సానుకూల దృక్పథంతో బాధ్యతలను నిర్వహించడం అవసరమన్నారు. పరస్పర సహకారం, సమన్వయం, టీమ్ వర్క్‌తో కార్యాలయ పనితీరును మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ కౌన్సెలింగ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి గురువారం ప్రత్యేక మానసిక ఆరోగ్య సెషన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తీవ్ర ఒత్తిడి లేదా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు, బంధువులను కూడా ఈ సెషన్స్‌కు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వాన్స్‌డ్ కౌన్సెలింగ్, గైడెన్స్ నిపుణులు విడియాల చక్రవర్తి, సైకాలజిస్టులు డా.జి.శంకరరావు, డా.టీఎస్ రావు, శ్రీపతి జగదీశ్, సైకాలజిస్టు బి.నవితాశ్రీ, నోడల్ అధికారి జి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, నోటీసుల విచారణను అక్టోబర్ 5లోపు పూర్తి చేయాలి

అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పురోగతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నోటీసుల జారీ, నోటీసులపై విచారణ, ఓటరు కార్డుల ఫోటోలను అప్డేట్ చేయడం, ఫారం--6, ఫారం--7, ఫారం--8 దరఖాస్తుల విచారణ స్థితి, బూత్ లెవల్ అధికారులతో ఫోన్ కాల్స్ తదితర అంశాలపై పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మొత్తం 1,94,681 మందికి నోటీసులు పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. వీరిలో ఇప్పటివరకు 1,87,335 మందికి విచారణ పూర్తి చేయగా, ఇంకా 7,346 మందికి విచారణ నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలోని 'ఇతరుల' కేటగిరీలో మొత్తం 13,95,044 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో తుది ఓటర్ల జాబితా కోసం 13,15,882 మందిని పార్క్ చేయడం జరిగిందని, ఇంకా 79,162 మంది పెండింగ్‌లో ఉన్నారని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను కూడా నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఓటరు కార్డుల ఫోటోలను అప్డేట్ చేసే ప్రక్రియలో జిల్లాలో మొత్తం 6,51,452 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులు 5,13,116 మంది ఓటర్ల ఫోటోలను అప్డేట్ చేశారని చెప్పారు. దీంతో అప్డేట్ చేసిన ఫోటోలలో 3,93,728 మందికి సంబంధించిన వివరాలను ఇఆర్ఓలు ఆమోదించడం జరిగిందని తెలిపారు.

మిగిలిన ఫోటో అప్డేట్, ఆమోద ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై కూడా సమావేశంలో సమీక్ష జరిగింది.

ప్రస్తుతం జిల్లాలో ఫారం--6 దరఖాస్తులు -- 6,281, ఫారం--7 దరఖాస్తులు -- 1,169, ఫారం--8 దరఖాస్తులు -- 4,862 పెండింగ్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఈ దరఖాస్తులన్నింటిపై అక్టోబర్ 5వ తేదీలోపు విచారణ ప్రక్రియను పూర్తి చేసి, ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తులను తుది ఓటర్ల జాబితాలో ప్రచురించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫారం--6, ఫారం--8 దరఖాస్తులకు సంబంధించి అధిక సంఖ్యలో తిరస్కరణలు నమోదైన నియోజకవర్గాల వివరాలను కూడా సమావేశంలో సమీక్షించినట్లు కలెక్టర్ తెలిపారు. తిరస్కరణకు దారితీసిన కారణాలు, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ తదితర అంశాలను నిబంధనల మేరకు పరిశీలిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఓటర్లు తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారులతో నేరుగా మాట్లాడేందుకు అందుబాటులో ఉన్న 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్వో' సేవకు సంబంధించి కూడా పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం 15 ఫిర్యాదులు 48 గంటల వ్యవధిలోపు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణ, దరఖాస్తుల పరిశీలన, ఫోటో అప్డేట్, బిఎల్ఓ-ఇఆర్ఓ స్థాయి ప్రక్రియలు తదితర అంశాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. అక్టోబర్ 5వ తేదీని విచారణ ప్రక్రియకు తుది గడువుగా పాటిస్తూ, నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

ఈ నెల 18న చందర్లపాడులో ప్రత్యేక గ్రీవెన్స్

నందిగామ నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

"ఒక నెల - ఒక నియోజకవర్గంశీ - నాలుగు పర్యటనలు"లి కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 18వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. చందర్లపాడు తునికిపాటి ఫంక్షన్ హాల్ నందు ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. నందిగామ నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ కోరారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విజయవాడ, మహానగర్

సమస్త విశ్వానికి దివ్య వాస్తుశిల్పి శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగినక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్యం, సృజనాత్మకత, శ్రమ, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి విలువలు విశ్వకర్మ జయంతి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సంప్రదాయ కళలు, కళాకారుల క్షేమం, సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని.. విశ్వకర్మ యోజన ద్వారా సాధికారిత కల్పించేందుకు కృషిచేస్తున్నాయన్నారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేతివృత్తుల కళాకారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆధునిక నైపుణ్యాల సముపార్జన ద్వారా చేతివృత్తులకు కొత్త వైభవం వస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారుని అంతర్జాతీయ లక్ష్యానికి పీ4 అండ

కెనడా వేదికపై జిల్లా కీర్తి చాటేందుకు సిద్ధం

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చొరవతో మార్గదర్శి ద్వారా ఆర్థిక సాయం



విజయవాడ, మహానగర్:

కెనడాలో జరగనున్న కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు సంకు కృపారావు అంతర్జాతీయ వేదికపై మరోసారి పతకం సాధించి ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అయితే అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను ఆశ్రయించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ లక్ష్మీశ వెంటనే స్పందించారు. క్రీడాకారుని ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, అంతర్జాతీయ వేదికపై దేశం, రాష్ట్రం, జిల్లాకు పేరు తీసుకురావాలనే ఆయన సంకల్పానికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో పీ4 ద్వారా సహకారం అందేలా చొరవచూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శిగా ముందుకు వచ్చిన సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను క్రీడాకారుడికి సహాయం అందించేలా అనుసంధానించారు. ఈ మేరకు సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సమకూర్చిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్రీడాకారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కృపారావు కెనడాలో జరగనున్న కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకం సాధించాలనే ఆయన సంకల్పం సాకారం కావాలని, ఆయన విజయంతో ఎన్టీఆర్ జిల్లా పేరు అంతర్జాతీయ క్రీడా వేదికపై మార్మోగాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జీఎం కె.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

రాహుల్ బలమా... బలహీనతా?

రాహుల్ గాంధీది భారత రాజకీయాల్లో ఒక నిలకడ లేని గ్రాఫ్! అది కొన్ని సార్లు పైకి, మరికొన్నిసార్లు కిందకి చలిస్తూ ఉంటుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాలు సదా అనిశ్చితిలో ఉంటున్నాయి. దాని ప్రతికూల ప్రభావం 'ఇండియా కూటమి' మీద పనిచేస్తోంది. రాహుల్ ప్రాధాన్యతలు, ప్రవర్తన, మిత్రులతో సయోధ్య వంటి అంశాలు ఈ మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మీడియా, సెఫాలజీ సంస్థల అంచనాలకు మించి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలతో ఏర్పడ్డ 'ఇండియా కూటమి' మెరుగైన ఫలితాలు సాధించింది. దేశంలోని 16 ముఖ్య సెఫాలజీ సంస్థలు ఇండియా కూటమి సంఖ్య 150 దాటదని జోస్యం చెప్పినా, 240 స్థానాలు పొంది ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇచ్చింది. 400 సీట్ల వారి కలల్ని కల్లలు చేసి, 290కి పరిమితం చేసింది. కానీ, తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పక్షాలు దారుణంగా దెబ్బతిన్నాయి. సానుకూల ఫలితాలకు ఆస్కారమున్న మహారాష్ట్ర, హర్యానా, బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా చతికిలపడ్డాయి. ఇందుకు ప్రధానంగా రాహుల్ (గ్రాఫ్) నిలకడలేని తనమే కాకుండా మిత్రపక్షాలతో కాంగ్రెస్ అనుసరించే అస్పష్ట వైఖరి, వ్యూహ వైఫల్యాలూ కారణమే! ఇదంతా బిజెపికి, అది నేతృత్వం వహించే ఎన్‌డిఎకి పరోక్షంగా మేలు చేస్తోంది. 'మా స్టార్ క్యాంపెయినర్ రాహుల్ గాంధీయే' అనే కొందరు బిజెపి నేతల వ్యంగ్య వ్యాఖ్యల్లోని 'హాస్యం' కన్నా వాస్తవికతే జనాల్ని ఎక్కువ ఆలోచింపజేస్తోంది. రాహుల్ గాంధీ రాజకీయ ప్రగతి సూచీ స్థిరంగా ఉండకపోవడానికి ఆయన ప్రాధాన్యతలు, ప్రవర్తనే కారణమని మేధావులు, రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తారు. 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఎక్కువ జనాదరణతో ఉన్నారు. 2019 ఎన్నికల ముందరితో పోల్చి చూస్తే, 2024 ముందర పలు సర్వేల జనాదరణలో ప్రధాని అభ్యర్థిగా మోడీకి కొంత సమీపంలోకి రాహుల్ రాగలిగారు. అప్పటికి దేశాన్ని చుట్టేస్తూ ఆయన అడ్డంగా, పొడువుగా రెండు పాదయాత్రలు చేసి ఉన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా ఎండగడుతూ పార్లమెంటులో చక్కని, ప్రభావవంతమైన ప్రసంగాలు చేస్తున్నారు. ప్రధాని మోడీకి, పారిశ్రామికవేత్త అదానీకి వీడదీయరాని బంధముందని చేసిన పార్లమెంట్ ప్రసంగం ఆకట్టుకుంది. కానీ, ఆ స్థిరత్వం 2024 ఎన్నికల తర్వాత కొనసాగలేదు. మారిన రాజకీయాల్లో నాయకుల అటెన్షన్ 24/7 గంటలు ప్రజలు ఆశిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రక్రియ నుంచి రాహుల్ తరచూ 'సెలవుల'పై వెళ్లడాన్ని జనం వింతగా చూస్తున్నారు. 'ఇతనికి సీరియస్‌నెస్ లేదు' అనే వ్యాఖ్య జనంలో తరచూ వినిపిస్తోంది. భారత్‌లో పరిస్థితుల్ని ఎత్తిచూపుతూ విదేశాల్లో చేసిన విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన పలుకుబడిని, నిబద్ధతని కొంత ఇరకాటంలో పెట్టాయి. ఆ క్రమంలో కిందకు జారిపోయిన రాహుల్ 'ఇమేజ్ గ్రాఫ్' ఇటీవల మళ్లీ ఊర్ధ్వముఖంగా సాగుతోంది. పాలక ఎన్‌డిఎ ఎదుర్కొన్న కొన్ని విపరిణామాలు, 'పేపర్ లీక్', 'చందాచోర్' 'జిడిపి గ్రోత్ రేట్ వివాదం' వంటి వాటిపై ప్రతికూలంగా వచ్చిన విస్తృత ప్రజాభిప్రాయం బిజెపిని ఇరుకున పెట్టడమే కాకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాల విమర్శలకు కొంత వెయిటేజీ పెంచింది.. ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఎంతో దన్నుగా ఉండి, కాలక్రమంలో, ముఖ్యంగా 2014 తర్వాత క్రమంగా దూరమైన దళితవర్గాల్ని పూర్తిగా తమవైపు తిప్పుకునే ప్రయత్నం జరుగుతోంది. 'దేశంలోనే అతిపెద్ద విపక్ష పార్టీ అధినేత (మల్లికార్జున్ ఖర్గే) కే ఈ గతిపడితే, ఇక దేశంలో సామాన్య దళితుల సంగతేమిటి?' అని రాహుల్ ప్రశ్నిస్తున్నారు. ఖర్గే పాల్గొన్న సభా వేదికను 'శుద్ధీకరణ' పేరిట ప్రక్షాళన చేసిన 'బిజెపి, ఆర్ఎస్ఎస్, దళిత వ్యతిరేక భావజాలం' అంతా ఒకటే అని ఆయన ప్రచారం చేస్తున్నారు. ఆ వరుసలోనే, మహిళా బిల్లు కంటితుడుపు చర్య చేసి, అమలును నిర్లక్ష్యం చేస్తున్న ఎన్‌డిఎది పురుషాధిక్య 'మనుస్మృతి' భావజాలమని, వారు మహిళల రిజర్వేషన్ అమలు చేయరనే వాదనను ఆయన జనంలోకి తెస్తున్నారు. 'క్షాత్రోంకీ గూంజ్' విద్యార్థులు, యువజనుల సదస్సులకు హాజరై బిగ్గరగా వారి అనుకూల స్వరం వినిపించడం ద్వారా జన్-జీ. జన్- ఆల్ఫాను ఆకట్టుకునే ప్రయత్నం రాహుల్ చేస్తున్నారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు దూరమైన యువతను, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఆకట్టుకుని, తమవైపు తిప్పుకునే వ్యూహంలో భాగమిది. తమ ఒత్తిడిపై దేశంలో కులగణనకు ఎన్‌డిఎ ప్రభుత్వం సిద్ధపడినా, ఒబిసిలకు న్యాయం చేయటం లేదనే విమర్శను కాంగ్రెస్ నాయకత్వం ఎత్తుకుంది. ఒబిసిలకు తాము అనుకూలమంటూ బిజెపి చేసుకునే ప్రచారం ఉత్తిదేనని, కులగణనలో ఎస్‌సి, ఎస్‌టిల మాదిరి బిసిలకు ప్రత్యేకంగా కాలమ్ పొందుపరచకపోవడాన్ని రాహుల్ తప్పుబడుతున్నారు. టిఎంసి, ఎన్‌సిపి, డిఎంకె, ఆప్.. తదితర పక్షాలతో, వివిధ రాష్ట్రాల్లో ఇది పలు సందర్భాల్లో రుజువయింది. సానుకూల వాతావరణంలో కూడా ప్రతికూల ఎన్నికల ఫలితాలకు ఈ సఖ్యత కొరవడటమే కారణం. ఇక ముఖ్యమైన ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాద్ (ఎస్‌పి) తో కాంగ్రెస్ సఖ్యత ఎలా ఉంటుంది? అన్నది కీలకం. 2029 సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందర అసెంబ్లీ ఎన్నికలు (ఫిబ్రవరి -2027) జరగాల్సిన యుపి ఏ రకంగా చూసినా ఇండియా కూటమికి ముఖ్యమైందే! 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌ఫి (36.6% ఓటు వాటా), కాంగ్రెస్ నేతృత్వపు యుపిఎ (2.33% ఓటు వాటా) విడివిడిగా పోటీ చేసి దెబ్బతిన్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఇండియా కూటమి, ఎస్‌పి 37, కాంగ్రెస్ 6, మొత్తం 43 ఎంపి స్థానాల (43.52% ఓటు వాటా) తో లబ్ధి పొందింది. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి వైఖరి అనుసరించనున్నారు? అన్నది కీలకం. ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ పలు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. పిచ్‌డే- దళిత్- అల్పసంఖ్యాక్/ పిడిఎ వ్యూహం ఆయన చేతిలో అస్త్రంగా ఉంది. బలహీనవర్గాలు (పిచ్‌డే)కు తోడు 'పి' అంటే 'పండిట్' కూడా అని ఇటీవలే ఒక సభలో వివరణ ఇచ్చిన అఖిలేశ్, బ్రాహ్మణ వర్గానికి చేరువ కావాలని చూస్తున్నారు. హిందుత్వ వాదనకు ఎస్‌పి వ్యతిరేకం కాదనే భావన వచ్చేలా.. 'సనాతన ధర్మం' ఈ దేశంలో ఐక్యత సాధించిందని కితాబిచ్చారు. ఒక వేదిక నుంచి 'హనుమాన్ చాలీసా' చదివారు. 'ఇటావా' నియోజకవర్గ పరిధిలో అఖిలేష్ చైర్మన్‌గా ఉన్న ఒక ట్రస్ట్ నిర్మిస్తున్న కేదారేశ్వర్ ఆలయం 2027 ఎన్నికలకు ముందరే ప్రారంభం కానుంది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ వల్లెవేస్తున్న 'మనుస్మృతి' కాంగ్రెస్ అనుసరించే 'హిందూ వ్యతిరేక' వైఖరికి నిదర్శనమని చెప్పేందుకు బిజెపి ప్రచారాస్త్రమవుతుందా? యుపిలో ఇది అఖిలేశ్‌తో పొసగని పొత్తు వ్యూహమవుతుందా? కాంగ్రెస్ కొంచెం ఆలోచించుకోవాలి!.

కార్పొరేట్ చేతిలో మీడియా బందీ



ఇటీవల ఓటీటీలో తెలుగులో అందుబాటులో ఉన్న మలయాళ రాజకీయ చిత్రం 'ప్రతిచ్ఛాయ' చూశాను. రాజకీయ ఎత్తుగడలు ఎంత సంక్లిష్టంగా ఉంటాయో ఈ సినిమా ఆసక్తికరంగా చూపించింది. అయితే ఈ సినిమాలో నన్ను ఎక్కువగా ఆలోచింపజేసిన అంశం -- కార్పొరేట్ సంస్థలు రాజకీయాలను, ముఖ్యంగా మీడియాను తమ చేతుల్లోకి తీసుకున్నప్పుడు ప్రజాస్వామ్యంపై పడే ప్రభావం. సినిమాలో ఒక సందర్భంలో వచ్చే సంభాషణ ఇలా ఉంటుంది. కార్పొరేట్ కంపెనీలకు సొంతంగా మీడియా ఉంటే నిజం అబద్ధం అవుతుంది. అబద్ధం నిజం అవుతుంది. ఇది అక్షరాలా నేటి వాస్తవం.

ఒకప్పుడు మీడియా అంటే ప్రజల గొంతుకగా ఉండేది. ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికారంలో ఉన్నవారి తప్పులను బయటపెట్టడం దాని ప్రధాన బాధ్యత. కానీ మీడియా సంస్థలే భారీ కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లినప్పుడు పరిస్థితి పూర్తిగా మారుతుంది. ఏ వార్తను ఇవ్వాలి? ఎలా ఇవ్వాలి? దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి? దేనిని ప్రజలకు దూరంగా ఉంచాలి? అనే నిర్ణయాలను ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు శాసించే ప్రమాదం ఉన్నది. మన దేశంలో పదేండ్లలో ప్రధాన మీడియా సంస్థల్లో అనేకం పారిశ్రామికవేత్తలతో సంబంధం ఉన్న కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిన పరిస్థితిని మనం చూస్తున్నాం. వారికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అండదండలు ఉన్నాయి. అలాంటి యాజమాన్య మార్పుల నేపథ్యంలో మీడియా ఎలాంటి వార్తలకు ప్రాధాన్యత ఇస్తున్నది? ఎలాంటి వార్తలను విస్మరిస్తున్నది? అనేది ప్రతి పౌరుడూ గమనించాల్సిన అంశం.

రూపాయి విలువ పతనం, విపరీతంగా పెరుగుతున్న ధరలు పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. కుటుంబాల ఆదాయం పెరుగలేదు. రోజువారీ అవసరాల ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుల నిత్య జీవితాలు భారంగా మారిపోయాయి. కానీ ఈ సమస్యలపై నిరంతర చర్చ, లోతైన విశ్లేషణ, ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం మీడియాలో ఎంతవరకు కనిపిస్తున్నది? విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో వైఫల్యాలు, నాణ్యమైన విద్య, వైద్యం సామాన్యుడికి అందకపోవడం, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం వంటి కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన బాధ్యత మీడియాపై ఉన్నది.

కానీ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి అసంబద్ధ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజల్లో ఉద్వేగాలను రెచ్చగొట్టే వార్తలను విస్తృతంగా ప్రచారం చేయడం, ప్రతిపక్షాల ప్రభుత్వాలు వారి వారి రాష్ట్రాల్లో మంచి పాలన అందిస్తుంటే ఓర్వలేక వారిపై ఆరోపణలు గుప్పించి, వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని కక్షపూరితంగా వ్యవహరించడం, ఇతర పార్టీలకు చెందిన నాయకులను బెదిరించి వారి పార్టీలో చేర్చుకోవడం మనం చూస్తున్నాం. వీటిపైనా మీడియాలో చర్చలు ఉండడం లేదు.

ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య, వైద్యం, ఉపాధి వంటి జీవన ప్రమాణాలను నిర్ణయించే అంశాలపై ప్రజలు ప్రశ్నలు అడుగకుండా, వారిని నిరంతరం భావోద్వేగ అంశాల చుట్టూ తిప్పడం ఒక రాజకీయ వ్యూహంగా మారింది. ఇది యువతను, మధ్యతరగతి ప్రజలను ఒక మత్తులో ఉంచి విచక్షణ కోల్పోయేలా చేస్తున్నది. మన రాష్ట్రంలో కూడా ఇదే జరిగింది. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, మంచిని మరుగుపరిచి, అబద్ధాలను ఓ వర్గం మీడియా ప్రచారం చేసింది. కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చి మభ్యపెట్టడం వల్ల ప్రజలు మోసపోయారు. ఫలితంగా నేడు జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిపోయింది. తెలంగాణ అభివృద్ధి గ్రాఫ్ పూర్తిగా పడిపోయింది. ఒకవేళ మీడియా స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసి ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం అయ్యేవి కావు. ప్రజాస్వామ్యం మరింత బలంగా ఉండేది.

ప్రజాస్వామ్యంలో మీడియా అంటే కేవలం వార్తలను అందించే సంస్థ కాదు. అది ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కీలకమైన వారధి. ప్రభుత్వం, ప్రతిపక్షంలో ఎవరు తప్పు చేసినా మీడియా ప్రశ్నించాలి. కార్పొరేట్ సంస్థలు తప్పు చేస్తే కూడా ప్రశ్నించాలి. మీడియా కార్పొరేట్ ప్రయోజనాలకు లొంగకుండా ప్రజా ప్రయోజనాలకు అద్దంగా నిలిచినప్పుడే, నిజం నిజంగానే ఉంటుంది. నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. లేకపోతే ప్రతిచ్ఛాయలో చెప్పినట్టుగా నిజం అబద్ధంగా మారుతుంది, అబద్ధం నిజంగా మారుతుంది. అప్పుడు ప్రమాదం ఒక వార్తకు, ఒక ప్రభుత్వానికి, ఒక పార్టీకి మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికే ప్రమాదం. అందుకే ప్రజలు కూడా వార్తలను గుడ్డిగా నమ్మకుండా, ఎవరు, ఏ విషయాన్ని, ఎందుకు చెప్తున్నారు? ఏ విషయాన్ని చెప్పడం లేదు? అనే ప్రశ్నలు వేసుకోవాలి. విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

బ్రిటన్‌లో వేర్పాటు భేరి!



బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన 'ఉగ్రవాదంపై యుద్ధా'నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు 'సమష్టి రక్షణ'ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్ల వేటకు తోడ్పడ్డాయి.

కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవహక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణహోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చు గానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి. బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించాలనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు. మనతో సహా అనేక దేశాలను పీల్చిపిప్పిచేసిన బ్రిటన్ ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకోగలదా అన్నది వేచిచూడాలి.

నూరు శాతం తప్పుడు చర్య

తీసుకునే నిర్ణయాలన్నీ వికటిస్తున్న వైనం కనబడుతూనే ఉన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించే పేరిట ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధించటానికీ... దాన్నుంచి ముడి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా తోడ్పడుతున్న భారత్, చైనాలపై వంద శాతం సుంకాలు విధించటానికీ అనుమతించే బిల్లును ఆయన ప్రభుత్వం ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకుంది. గత నెల ఇదే బిల్లుకు సెనేట్ ఓకే చెప్పింది. తాజా ఆమోదంతో ఈ ఆంక్షల బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ అంగీకారం తెలిపినట్టయింది. దీనిపై ట్రంప్ సంతకం చేశాక చట్టంగా మారుతుంది. ఆ అధికారాన్ని ట్రంప్ వినియోగిస్తారా లేదా అన్నది చూడాల్సివుంది. రెండోసారి అధికారంలోకొచ్చాక రష్యాపై ట్రంప్ విధించ దల్చుకున్న ఈ ఆంక్షలు అత్యంత కీలకమైనవి. ఈసారి ఆంక్షలన్నీ రష్యా ఇంధన, రక్షణ రంగాలే లక్ష్యంగా రూపొందించారు. తన అభీష్టానికి విరుద్ధంగా ఇరుగు పొరుగు దేశాలు నిర్ణయాలు తీసుకుంటే వాటితో ద్వైపాక్షిక వాణిజ్యంతోసహా వివిధ బంధాలన్నిటినీ తెంచుకోవటం ఏ ప్రభుత్వమైనా చేసే పని. కానీ 'తన చావు జగత్ప్రళయమ'న్న రీతిలో ఆ పనే అందరూ చేసితీరాలనే డిమాండ్ మూర్ఖత్వం. అంతర్జాతీయంగా 80 ఏళ్ల క్రితం కుదిరిన ఒడంబడిక ప్రకారం దురాక్రమణ యుద్ధాలకు పాల్పడే దేశంపై ఎలాంటి చర్యలు అవసరమో ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి నిర్ణయిస్తాయి. రష్యా తప్పు చేస్తున్నదని అమెరికా భావిస్తే ఆ వేదికలద్వారా ఒత్తిళ్లు తీసుకురావాలి. అలా చేయలేననుకుంటే తనవరకూ ఇష్టానుసారం చేసుకోవచ్చు. అసలు ట్రంప్ అత్యుత్సాహంతో అమలు చేస్తున్న సుంకాల విధానంపై అమెరికాలోనే ఏకాభిప్రాయం లేదు. రష్యాపై కఠిన చర్యల్ని సమర్థిస్తున్న డెమోక్రాట్లు సైతం ట్రంప్‌కు అతిగా అధికారాలు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఏకపక్ష అధికారాలు అప్పగిస్తే దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు. మన దేశం గతంకన్నా దృఢంగా వ్యవహరించటం హర్షించదగ్గది. ప్రస్తుత విధానాన్ని విడనాడబోమనీ, మార్కెట్ చలనాలను నిర్దేశించే ధరవరలు, సరఫరా, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేయడం కొనసాగిస్తామనీ స్పష్టంచేసింది. వంద శాతం సుంకాలపై అమెరికా చర్యకు దిగితే ద్వైపాక్షిక సంబంధాలపై వాటి ప్రభావం పడుతుందని ఇప్పటికే అమెరికాకు తెలియ జేశామని తెలిపింది.

అటు కరవు.. ఇటు వరదలు

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల కారణంగా భూమిపై నీటి వ్యవస్థ (వాటర్ సైకిల్) తీవ్ర అస్తవ్యస్తంగా, అత్యంత ప్రమాదకరంగా మారుతోందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) గురువారం హెచ్చరించింది. గ్లేసియర్లు (హిమానీనదాలు) వేగంగా కరిగిపోతుండటం, మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో ఒకచోట భారీ వరదలు, మరోచోట కరవులు సంభవిస్తున్నాయని పేర్కొంది. రానున్న భయంకరమైన ఎల్‌నినో ప్రభావం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయనుందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా భవిష్యత్తులో ప్రజల జీవనోపాధి, ఆరోగ్యం, ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రిపోర్టులో పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచం ముందు భారీ నీటి సంక్షోభం ముప్పు పొంచి ఉందని, ఇదంతా మానవాళి మనుగడకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయని హెచ్చరించింది. ఐదేళ్ల పాటు పరిశోధన చేసిన 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ వాటర్ రిసోర్సెస్' రిపోర్టులో డబ్ల్యూఎంఓ ఈ కీలక విషయాలు వెల్లడించింది.



ఆసియా, ఆఫ్రికాపైనే అత్యధిక ప్రభావం

గత ఐదేళ్లలో సంభవించిన నీటి సంబంధిత విపత్తుల్లో (వరదలు, కరవులు) సగానికిపైగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే ఉన్నాయని డబ్ల్యూఎంఓ స్పష్టం చేసింది. ఈ రిపోర్ట్ ప్రకారం, నీటి విపత్తుల వల్ల సంభవించిన మరణాల్లో 80 శాతానికిపైగా ఈ రెండు ఖండాల్లోనే నమోదవడం గమనార్హం. కొన్ని చోట్ల ఒక విపత్తు నుంచి కోలుకోక ముందే మరో తీవ్ర ఘటన సంభవించిందని పేర్కొంది. డబ్ల్యూఎంఓ నివేదిక ప్రకారం, భూమిపై ఉన్నటువంటి అన్ని ప్రధాన గ్లేసియర్ ప్రాంతాలు మంచును కోల్పోతుండటం ఇది వరుసగా నాలుగో ఏడాది. 2023-25 మధ్య కాలంలో చూస్తే గ్లేసియర్లు ఏకంగా 1400 గిగాటన్నుల మంచును కోల్పోయాయి. ఈ నీరు ఎంత ఎక్కువ అంటే దీనితో సుమారు 56 కోట్ల ఒలింపిక్ పరిమాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్స్‌ను నింపొచ్చు. ఇంకా సమస్త మానవాళి ఏడాది పొడవునా ఉపయోగించే మంచినీటిలో సుమారు మూడోవంతుకు సమానం. 2025లో ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండింతల బావుల్లో భూగర్భ జలాలు చారిత్రక సగటు కంటే కూడా దారుణంగా పడిపోయాయి. భూమిపై నీటి నిల్వల్లో భూగర్భ జలాల పాత్ర కీలకం. కానీ భారత్, ఐరోపా, అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలోని పలు ప్రాంతాల్లో ఈ భూగర్భ జలాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2022-25 మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో తరచుగా భూగర్భ జలాల లోటు నమోదైంది.

ఇంకా 2025 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా నదుల్లో నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిపోయింది. అంటే నదుల్లో నీటి మట్టాలు కూడా వేగంగా పడిపోతున్నాయని, గత 35 ఏళ్లలో చూస్తే అత్యల్ప నీటి ప్రవాహం నమోదైన సంవత్సరాల్లో ఇదొకటిగా నిలిచిందని జెమీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అమెజాన్, జాంబేజీ, నైలు వంటి ప్రధాన నదీ పరివాహక ప్రాంతాల్లోనూ నీటి ప్రవాహాలు పెద్ద మొత్తంలో పడిపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

ప్రపంచ దేశాలు సహకరించుకుంటేనే సమస్యకు పరిష్కారం!

డబ్ల్యూఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్టే సౌలో మాట్లాడుతూ, 'గ్లేసియర్లు, భూగర్భ జలాలు భూమికి ఒక బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ వంటివి. ఇవి కరవు కాలంలో భూమిని కాపాడే రక్షణ కవచంగా (బఫర్) పనిచేస్తాయి. సాధారణంగా దశాబ్దాల వరకు ఇవి నీటిని నిల్వ చేసుకుంటాయి. కానీ ఇటీవల పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. మనం ఆ సేవింగ్స్ ఖాతాను నిరంతరం వాడేస్తూ ఖాళీ చేస్తున్నాం. 2014-16 నుంచి ప్రపంచవ్యాప్తంగా నీటి నిల్వలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. వరుసగా నాలుగో సంవత్సరం కూడా భూమిపై ఉన్న ప్రతి ప్రధాన హిమానీనద ప్రాంతం తీవ్రంగా మంచును కోల్పోయింది. ప్రపంచవ్యాప్తంగా 2025లో మూడింట రెండొంతుల బావుల్లో భూగర్భ జలాలు సాధారణం కంటే దిగువ స్థాయికి పడిపోయాయి' అని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎల్ నినో రానున్న రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో వరదల్ని, మరికొన్ని ప్రాంతాల్లో కరవుల్ని తెచ్చిపెట్టే ప్రమాదం ఉందని సౌలో హెచ్చరించారు. ఇదే సమయంలో నీటికి సరిహద్దులేం ఉండవని, ఒక దేశంలో నదీ పరివాహక ప్రాంతంలో జరిగే మార్పులు, మరో దేశంలోని నీటి లభ్యతను కూడా ప్రభావం చేయగలవని ఆమె స్పష్టం చేశారు. కాబట్టి ప్రపంచ దేశాలన్నీ నీటి డేటాను పరస్పరం పంచుకుంటూ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అప్పుడు మాత్రమే రానున్న ముప్పు నుంచి మానవాళిని కాపాడుకోగలమని చెప్పారు.

సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

సెమీకండక్టర్ రంగంలో భారత్ శరవేగంగా ముందుకు వెళ్తోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచ చిప్ తయారీకి కొత్త, నమ్మకమైన కేంద్రాల అవసరం పెరుగుతున్న సమయంలో భారత్ గ్లోబల్ హబ్?గా సిద్ధమవుతోందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని, దీంతో ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దిల్లీలో గురువారం ప్రారంభమైన సెమీకాన్ ఇండియా 2026 ఐదో ఎడిషన్‌లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు.



చిప్ తయారీకి భారత్

సెమీకండక్టర్ తయారీకి ప్రపంచ దేశాలు కొత్త, విశ్వసనీయ ప్రాంతాలను వెతుకుతున్నాయని మోదీ చెప్పారు. భారత్ కూడా చిప్ తయారీకి ప్రాధాన్య కేంద్రంగా ఎదిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. తయారీదారులు విజయవంతం కావడానికి అవసరమైన విధానాలు, నిబంధనలు, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. ఇప్పటికే దేశంలో 12 చిప్ తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని ప్రధాని వెల్లడించారు. రానున్న దశలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. చిప్ డిజైన్, అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాకుండా, చిప్ తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, ముడి పదార్థాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాలను కలిపి పూర్తి సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని వివరించారు.

మిషన్ 2.0కు భారీగా నిధులు

భారత్ సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ప్రభుత్వం కేటాయింపులను భారీగా పెంచిందని మోదీ తెలిపారు. మొదటి దశలో 8 బిలియన్ డాలర్లుగా ఉన్న కేటాయింపులను 13.5 బిలియన్ డాలర్లకు పెంచినట్లు చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. దేశంలో సెమీకండక్టర్ రంగం ఎదగడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు కొత్త కంపెనీలు, ఉద్యోగాలు, పరిశోధన అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కొన్ని ప్రాంతాలపై ఉన్న ఆధారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో భారత్‌కు ఇది ఒక పెద్ద అవకాశంగా మారుతుందని చెప్పారు.

15 రోజుల్లోనే!

భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో గత 15 రోజుల పరిణామాలను చూస్తే అర్థమవుతుందని మోదీ అన్నారు. సెప్టెంబర్‌లో ముంబయిలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ జరిగిందని గుర్తుచేశారు. అక్కడ ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటం టెక్నాలజీల ద్వారా సమ్మిళిత ఆర్థిక సేవలపై చర్చ జరిగిందన్నారు. అదే సమయంలో దేశంలో సుమారు 3 వేల కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. దీనివల్ల దేశవ్యాప్తంగా సరుకు రవాణా వేగం పెరుగుతుందని, లాజిస్టిక్స్ మరింత మెరుగవుతాయని తెలిపారు. మెరుగైన రవాణా వ్యవస్థ తయారీ రంగానికి మరింత బలాన్ని ఇస్తుందని మోదీ చెప్పారు.

ఆర్థిక వృద్ధి- ప్రపంచ నమ్మకం

భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ప్రధాని అన్నారు. అదే సమయంలో ప్రపంచ దేశాలకు భారత్‌పై ఉన్న విశ్వాసం కూడా పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుత సవాళ్ల మధ్య కూడా దేశం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన రేటింగ్ సంస్థ జేసీఆర్ఏ భారత్ రేటింగ్‌ను పెంచిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. భారత్‌లో తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఎదగడానికి సెమీకండక్టర్ రంగం ఉపయోగపడుతుందని మోదీ తెలిపారు.

విశ్వకర్మ జయంతి- సెమీకాన్‌కు అనుసంధానం

విశ్వకర్మ జయంతి రోజున సెమీకాన్ ఇండియా కార్యక్రమం జరగడం ప్రత్యేకమని ప్రధాని అన్నారు. సృష్టి, నిర్మాణానికి విశ్వకర్మ ప్రతీకగా భారత సంప్రదాయంలో భావిస్తారని చెప్పారు. ఒకవైపు శతాబ్దాల నాటి నిర్మాణ సంప్రదాయం, మరోవైపు 21వ శతాబ్దపు సాంకేతికత, ఆలోచన ఈ రెండింటి కలయికే ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ లక్ష్యానికి స్ఫూర్తి అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు దిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో సెమీకాన్ ఇండియా 2026 జరుగుతోంది. సిలికాన్ టు సిస్టమ్స్: బిల్డింగ్ ద ఎకోసిస్టమ్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ సెమీకండక్టర్ రంగానికి చెందిన కంపెనీలు, నిపుణులు, పెట్టుబడిదారులు ఇందులో పాల్గొంటున్నారు.

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలపై భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉధంపూర్ జిల్లాలోని మజల్తా ప్రాంతంలోని బ్రెట్టల్ సోహన్, ఖుబ్బన్ అటవీ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే వారికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేవీ)తో సంబంధాలున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సెప్టెంబర్ 16 (బుధవారం)న బ్రాటెల్ సోన్, ఖుబ్బన్ అటవీప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారని పక్కా సమాచారం అందడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. సుమారు రాత్రి 9 గంటల సమయంలో సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. నిర్దిష్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు ప్రారంభించారు. ఆపరేషన్ మొదలైన కాసేపటికే ఉగ్రవాదుల స్థావరం లక్ష్యంగా భద్రతాబలగాలు కాల్పులు జరిపాయి. పేలుళ్ల శబ్దాలు కూడా అటవీప్రాంతంలో వినిపించాయి. అయితే గురువారం ఉదయం భద్రతా వలయాన్ని తప్పించుకునేందుకు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరంగా కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. అదనపు బలగాలతో అటవీ ప్రాంతాన్ని నలువైపులా దిగ్బంధించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఆపరేషన్

అదనపు బలగాలను ఘటనాస్థలికి తరలించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇద్దరు ఉగ్రవాదులు హతమైనప్పటికీ, ప్రాంతంలో మరెవరైనా దాక్కున్నారా అనే కోణంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఆపరేషన్ పూర్తిగా ముగియలేదని సైన్యం స్పష్టం చేసింది. మిగిలిన ముప్పును గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో మోహరించి ఉన్నాయని వైట్ నైట్ కార్ప్స్ తెలిపింది. హతమైన వారి గుర్తింపు, ఇతర వివరాలపై అధికారికంగా మరింత సమాచారం వెలువడాల్సి ఉంది.

లష్కరే ఉగ్రవాది హతం

ఇటీవల దక్షిణ కశ్మీర్‌లోని సైద్‌పొరా ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా (లజు) ఉగ్రవాదిని భద్రతా బలగాలు హతమార్చాయి. జులై 8న ఐదు రోజుగా దాక్కొని ఉన్న ఎల్?ఈటీ ఉగ్రవాదని ఎన్?కౌంటర్?లో మట్టుబెట్టాయి. షోపియాన్‌లోని సైద్‌పొరా ప్రాంతంలోని దట్టమైన పండ్ల తోటలో ఇద్దరు ఉగ్రవాదులు నదుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు నిఘా కెమెరాల్లో రికార్డైంది. లష్కరే కమాండర్ జాకీర్ గనాయ్, అతని అనుచరుడు లతీఫ్ భట్ సంచరిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జులై 3న షోపియాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్(ఆర్ఆర్), సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ సెర్చ్ ఆపరేషన్?ను ప్రారంభించాయి. ఆ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి జల్లెడ పట్టాయి. రాత్రి వేళల్లో సైతం ఆపరేషన్ నిరాటంకంగా కొనసాగేలా ఆ ప్రాంతమంతా ప్రత్యేక లైట్లను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే జులై 8 ఉదయం ఉగ్రవాదులు బలగాలకు తారసపడగా కాల్పులు జరిపారుయ. వాటికి ప్రతిగా భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులు జరిపాయి. ఇరువర్గాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఆ తర్వాత ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం సమీపంలో ఉగ్రవాది మృతదేహాన్ని గుర్తించారు. అతడిని జాకిర్ అహ్మద్ గనీగా గుర్తించారు. ఘటనాస్థలికి సమీపంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి గుర్తించినట్లు పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఉగ్రవాది లతీఫ్ కోసం భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా మేలో దేశాన్ని కుదిపేసిన పుల్వామా ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి అర్జుమంద్ గుల్జార్ అలియాస్ బుర్హాన్ హంజా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో హతమైనట్లు తెలిసింది. గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయ పడిన హంజా, రావల్పిండి కంబైన్డ్ మిలిటరీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

దేశ అభివృద్ధి అజెండాలో జాతీయ భద్రత చాలా కీలకం

ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని క్షేత్రస్థాయిలో దృఢంగా అమలు చేయడం దేశంలోనే తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే జరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించి భారత్ కేవలం దౌత్యపరమైన ఖండనలకే పరిమితం కాకుండా నిర్ణయాత్మకమైన, శక్తివంతమైన సమాధానాలను ఇచ్చే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. మోదీ హయాంలోనే దేశంలో నక్సలిజం నిర్మూలించామని గుర్తు చేశారు. ఈశాన్య ప్రాంతంలో దశాబ్దాల నాటి వివాదాలు శాంతి ఒప్పందాల ద్వారా పరిష్కారమయ్యాయని వెల్లడించారు. అలాగే దేశ సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని స్పష్టం చేశారు. అంతర్గత భద్రత, సరిహద్దు నిర్వహణలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ సందర్భంగా అమిత్ షా ప్రస్తావించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానం క్షేత్రస్థాయిలో అమలు కావడాన్ని దేశం మొదటిసారిగా చూసింది. ఆర్టికల్ 370 రద్దు, సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి నిర్ణయాలు జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించి భారత్ ఇక కేవలం దౌత్యపరమైన ఖండనలకే పరిమితం కాదని నిరూపించాయి. నిర్ణయాత్మకమైన సమాధానాలను ఇస్తుందని ప్రపంచానికి చాటిచెప్పాయి. దేశంలో అంతర్గత తిరుగుబాట్లను సమర్థవంతంగా అదుపు చేశాం. అలాగే దీర్ఘకాలిక ప్రాదేశిక, జాతిపరమైన సమస్యలు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. నక్సలిజాన్ని నిర్మూలించాం. ఈశాన్య ప్రాంతంలో దశాబ్దాల నాటి వివాదాలు శాంతి ఒప్పందాల ద్వారా పరిష్కారమయ్యాయి. దేశ సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయి. దేశ అభివృద్ధి అజెండాలో జాతీయ భద్రత అనేది ఒక కీలకమైన పునాది. "

కర్ణాటక ప్రజలకు షా శుభాకాంక్షలు

మరోవైపు, హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు నిజాంలు, రజాకార్ల క్రూర పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులకు కేంద్ర హోం అమిత్ షా నివాళులర్పించారు. ఈ క్రమంలో కర్ణాటక ప్రజలకు హైదరాబాద్ విమోచన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చారిత్రక దినం భావి తరాలకు దేశభక్తి, ధైర్యసాహసాల స్ఫూర్తిని నిరంతరం గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. "హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా కర్ణాటక ప్రజలకు శుభాకాంక్షలు. అవిభక్త భారతదేశాన్ని నిర్మించే క్రమంలో నిజాంలు, రజాకార్ల క్రూర పాలనను అంతం చేసిన స్వేచ్ఛా కాంక్ష, దేశభక్తి అనే అజేయమైన స్ఫూర్తిని ఈ రోజు భావి తరాలకు గుర్తుచేస్తూనే ఉంటుంది. స్వాతంత్ర్య పోరాట అమరవీరులకు వందనాలు." అని ఎక్స్‌లో అమిత్ షా మరో పోస్ట్ పెట్టారు.

ప్రధానికి ముర్ము, చంద్రబాబు, పవన్ పుట్టినరోజు శుభాకాంక్షలు

మరోవైపు, గురువారం నరేంద్ర మోదీ పుట్టిన రోజు కావడంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు ప్రధానికి శుభాకాంక్షలు తెలియజేశారు. గడిచిన 25 ఏళ్లలో ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సుపరిపాలనను అందించారని నరేంద్ర మోదీని ముర్ము కొనియాడారు. ఎన్నో నూతన ప్రమాణాలను నెలకొల్పారని ప్రశంసించారు. ఈ ప్రజా సేవను మరింతకాలం కొనసాగించేలా మోదీ మరింత ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీ నాయకత్వం నిజంగా చరిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి ఒక గొప్ప ప్రజాదరణ పొందిన ప్రధానిగా దేశాన్ని నడిపించడం వరకు 25 ఏళ్ల మోదీ ప్రజాసేవ భారత్ అభివృద్ధి ప్రయాణానికి నూతన వేగాన్ని ఇచ్చిందన్నారు. మోదీ సేవాగుణం, సంకల్పం, సుపరిపాలన, విజన్ దేశంలోని 140 కోట్ల మంది ప్రజల్లో స్ఫూర్తి నింపుతోందని అభిప్రాయపడ్డారు. భరతమాత సేవలో నిరంతరం శ్రమిస్తున్న మోదీకి వేంకటేశ్వర స్వామి ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నానని అన్నారు.

మోదీకి దేవేగౌడ బర్త్ డే విషెస్

ప్రధాని నరేంద్ర మోదీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు మాజీ ప్రధాని, జనతా దళ్ (సెక్యులర్) అధినేత హెచ్‌డీ దేవెగౌడ. గురువారం మోదీ జన్మదినం కావడంతో విషెష్ చెబుతూ ఓ లేఖను రాశారు. దీన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. నరేంద్ర మోదీ సుదీర్ఘకాలం జీవించాలని, ఆరోగ్యంగా ఉండాలని దేవేగౌడలో లేఖలో ఆకాంక్షించారు. దేశాన్ని ముందుకు నడిపించడంలోనూ, దేశ సేవలోనూ నిరంతరం శక్తిని కలిగి ఉండాలని అన్నారు.

140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నాం



రష్యా నుంచి మురు కొనుగోలు చేసే దేశాలపై సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించటంపై భారత్ దీటుగా స్పందించింది. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రతను కాపాడటానికి కట్టుబడి ఉన్నామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇంధన అవసరాలను వివిధ వనరుల నుంచి తీర్చుకుంటూ, మారుతున్న అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. అమెరికా ప్రతిపాదిత ఆంక్షల ప్రభావంపై భారత్ గత కొన్ని నెలలుగా ఆ దేశ అధికారులతో చర్చలు జరిపినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపైనా ఈ తరహా చర్యల ప్రభావం ఉండొచ్చని భారత ప్రతినిధులు అమెరికా అధికారులకు వివరించినట్లు వెల్లడించింది. ఇంధన దిగుమతుల విషయంలో భారత్ ఒకే దేశంపై ఆధారపడకుండా వివిధ మార్గాలను అనుసరిస్తోందని కేంద్రం పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితులు మారుతున్న కొద్దీ కొనుగోలు వనరులను కూడా సర్దుబాటు చేసుకుంటామని తెలిపింది. అమెరికా బిల్లు ముందుకు సాగుతున్న నేపథ్యంలో భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, తదుపరి పరిణామాలను బట్టి ప్రభుత్వం స్పందిస్తుందని తెలిపింది. అదే సమయంలో దేశీయ వాణిజ్య, పరిశ్రమల సంస్థలతో కలిసి పనిచేసి కొత్త పరిణామాల వల్ల ఎదురయ్యే ప్రభావాలను ఎదుర్కొనేందుకు చర్యలు చేపడతామని పేర్కొంది.

అమెరికా సభలో బిల్లుకు ఆమోదం

రష్యా, ఇరాన్‌పై ఆంక్షలను మరింత కఠినతరం చేసే 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'కు అమెరికా ప్రతినిధుల సభ బుధవారం ఆమోదం తెలిపింది. మొత్తం 262 మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 159 మంది వ్యతిరేకించారు. ఇప్పటికే అమెరికా సెనెట్‌లోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించింది. దీంతో తదుపరి ప్రక్రియ కోసం బిల్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వద్దకు వెళ్లింది. ఈ చట్టంలో రష్యా ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, బ్యాంకింగ్ వ్యవస్థతో పాటు ఆ దేశ ఇంధన ఎగుమతులకు సంబంధించిన సంస్థలు, నౌకలపై చర్యలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. ముఖ్యంగా రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేసే ప్రధాన దేశాలపై అమెరికా అదనపు ఒత్తిడి తీసుకొచ్చేలా నిబంధనలు రూపొందించారు.

భారత్‌కు 100 శాతం సుంకం ముప్పు?

ఈ బిల్లులోని కీలక నిబంధన అమెరికా అధ్యక్షుడికి రష్యా పెట్రోలియం లేదా సహజవాయువు దిగుమతి చేసుకునే ఐదు అతిపెద్ద దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం కల్పిస్తుంది. రష్యా చమురు కొనుగోలు చేసే ప్రధాన దేశాల్లో భారత్, చైనా ఉండటంతో ఈ నిబంధనల ప్రభావం భారత్‌పైనా పడే అవకాశం ఉందనే చర్చ మొదలైంది. అయితే బిల్లు ఆమోదమైనంత మాత్రాన భారత్‌పై తక్షణమే 100 శాతం సుంకం అమల్లోకి వచ్చినట్లు కాదు. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత, అందులో పేర్కొన్న పరిస్థితులు నెరవేరితే అమెరికా అధ్యక్షుడు ఆ అధికారాన్ని వినియోగించాల్సి ఉంటుంది. అంటే ప్రస్తుతానికి ఇది తక్షణ సుంకం కాకుండా భవిష్యత్తులో సుంకం విధించే అవకాశం కల్పించే చట్టపరమైన మార్గం మాత్రమే. రష్యాపై ఆంక్షలతో పాటు ఇరాన్‌కు సంబంధించిన ఆంక్షలను కూడా చేర్చారు. ట్రంప్ కోరిన మేరకు ఇరాన్‌పై ప్రస్తుతం ఉన్న ఆంక్షలను మరో ఐదేళ్లు పొడిగించే అంశం కూడా బిల్లులో ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.

25 ఏళ్ల నిస్వార్థ ప్రజాసేవ

ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సుజనా చౌదరి, మంత్రి సత్యకుమార్



విజయవాడ, మహానగర్

ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినం, 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా కృష్ణమ్మ ఒడ్డున దుర్గా ఘాట్ వద్ద గురువారం ప్రత్యేక జలహారతుల కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని జన్మదినం సందర్భంగా ఆయనకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, విజయాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఇంటింటా దీపాలు వెలిగించాలని బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి కృష్ణమ్మకు జలహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ 25 ఏళ్ల ప్రజాసేవకు అంకితమైన ప్రధాని నరేంద్ర మోదీ నవభారత నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. భగవంతుడు ప్రధాని మోదీకి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, దేశ సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జిల్లా బీజేపీ ఇన్‌చార్జి నార్నీ తాతాజీ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఎన్‌టీఆర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు బొమ్మదేవర రత్నకుమారి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి, మహానగర్

భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దంపతులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డులోని శ్రీశ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి కొలుసు పార్థసారథి, ఆయన సతీమణి కమలా లక్ష్మి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం దీపాలు వెలిగించి ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నరేంద్ర మోదీ చేపట్టిన సంస్కరణలతో పారిశ్రామిక, విద్యా తదితర అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి సాధిస్తూ ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తోందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా--మేడ్ ఇన్ ఇండియా' నినాదంతో గతంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అనేక ముడి సరుకులు, ఆహార పదార్థాలు, వస్త్రాలు, యంత్రాలను ప్రస్తుతం దేశంలోనే ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదిగిందని పేర్కొన్నారు. గతంలో ఇండోనేషియా, మలేషియా నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం దేశీయ ఉత్పత్తి పెరిగి ఎగుమతి చేసే స్థాయికి చేరామని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక పరిశ్రమలు, ప్రాజెక్టులు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మిస్తూ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రోత్సాహం అందించారని అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో త్వరలో అమరావతి నిర్మాణం పూర్తవుతుందని, పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ సహాయ సహకారాలు ఎంతో ఉన్నాయని, ఆయన సహకారంతో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మోదీ పరిపాలనకు ముందు యుద్ధ విమానాలు, యుద్ధ పరికరాలు, ఇతర యంత్రాలను దిగుమతి చేసుకునే స్థితిలో ఉన్న భారత్ నేడు వాటిని దేశంలోనే తయారు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్. వేణు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాపా శ్రీను, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- త్వరలో 'ఆదరణ-3' పునఃప్రారంభం.. ఆధునిక పనిముట్ల పంపిణీ
- వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛను అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం
- విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి



విజయవాడ, మహానగర్

రాష్ట్రంలోని విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం, సమగ్ర ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి తెలిపారు. స్థానిక తుమ్మల పల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేవశిల్పి విరాట్ విశ్వ కర్మ భగవాన్ రాష్ట్ర స్థాయి జయంతోత్సవము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి హాజరై మాట్లాడుతూ.. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న విశ్వ బ్రాహ్మణులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం త్వరలోనే 'ఆదరణ-3' పథకాన్ని పునఃప్రారంభించి ఆధునిక పనిముట్లను అందించనుందన్నారు. సంప్రదాయ వృత్తిదారులకు ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి వృత్తి సామర్థ్యం, ఆదాయ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛను మంజూరు చేయాలన్న అంశాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడేలా చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తపరచారు. విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. వారి సహకారంతో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా ఉన్న విశ్వ బ్రాహ్మణులు విడివిడిగా కాకుండా ఏకీకృతంగా సంఘటితమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజం ఏకతాటిపైకి వచ్చినప్పుడే తమ సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, తగిన గుర్తింపు మరియు చట్టసభల్లో ప్రాతినిధ్యం సాధించే అవకాశాలు మెరుగుపడతాయని ఆమె పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ పాలకమండలి డైరెక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి తెలియజేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. విశ్వ సృష్టికి మూలకారకులు, సాంకేతికతకు మార్గదర్శకులు దేవశిల్పి విరాట్ విశ్వకర్మ భగవాన్ అని పేర్కొన్నారు. సృష్టి నిర్మాణంలోనూ, భారతీయ సంస్కృతి-సంప్రదాయాలలోనూ విశ్వకర్మల పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. భారతదేశ మూల సంతతికి ఆదిపురుషులు విశ్వకర్మలే అని వాస్తు, శిల్పకళలకు శాస్త్రీయ దృక్పథాన్ని జోడించి నాగరికతకు ప్రాణం పోసిన ఘనత వీరిదన్నారు. శతాబ్దాల క్రితమే కాలజ్ఞానంలో ఆకాశంలో ఇనుప పక్షులు ఎగురుతాయని చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గారి మాటలు నేటి విమానాలు, ఆధునిక డ్రోన్ టెక్నాలజీల రూపంలో నిజమయ్యాయన్నారు. గత 25 సంవత్సరాలుగా విజయవాడలో ప్రజాప్రతినిధిగా ఉన్న నాకు, విశ్వబ్రాహ్మణుల సేవలను నిరంతరం దగ్గరుండి చూసే భాగ్యం కలిగిందనారు. సంపాదించిన దాంట్లో పేదలకు సాయం చేస్తూ 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనతో సమాజ హితానికి కృషి చేసే నిస్వార్థ గుణం విశ్వబ్రాహ్మణుల సొంతం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, పేదరిక నిర్మూలనకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎక్స్-అఫిషియో సెక్రటరీ టు గవర్నమెంట్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ.. విశ్వకర్మ వంశీయులైన స్వర్ణకారులు, వడ్రంగులు, కాంస్యకారులు, కమ్మరులు, శిల్పకారులు సంప్రదాయ వృత్తులతో సమాజ అభివృద్ధికి కీలకంగా నిలిచారని అన్నారు. ఆధునిక కాలంలో ఈ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌తో పాటు ప్రత్యేకంగా స్వర్ణకారుల అభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ. మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని విశ్వబ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంప్రదాయ వృత్తులకు ఆధునిక సాంకేతికతను జోడించి ఆర్థికంగా ఎదగాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన చైర్మన్ పేరేపి ఈశ్వర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జీవీణ), ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ భీమశంకర్, బీసీ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ గౌరవ డైరెక్టర్లు, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ముందుగా దేవశిల్పి విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి ముందుగా అతిథులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆరోగ్య పరిరక్షణకు ఆయుర్వేద భరోసా

- జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం
- 515 మందికి వైద్య పరీక్షలు
- ప్రజలకు ఉచిత ఓపీ, ఐపీ సేవలు అందిస్తున్నాం
- ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.జగదీష్



విజయవాడ, మహానగర్

జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని "రేపటి ఆరోగ్యం కోసం ఆయుర్వేదం" అనే నినాదంతో ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన, ఉచిత వైద్య సేవలను అందించనున్నట్లు విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం సత్యనారాయణపురం శ్రీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం వద్ద ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. శిబిరంలో మొత్తం 515 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా ఆయుర్వేద వైద్య సలహాలు అందించడం జరిగిందన్నారు. ప్రధానంగా కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, పైల్స్, చర్మ వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు వంటి వివిధ రకాల అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. జగదీష్ మాట్లాడుతూ ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు, విజయవాడలోని డా.ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మరియు డా.నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న నిర్వహించనున్న 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా "రేపటి ఆరోగ్యం కోసం ఆయుర్వేదం" అనే నినాదంతో ప్రజలకు ఆయుర్వేద వైద్య విధానం, ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడ బందరు రోడ్డులో ఉన్న శ్రీ ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద వంద పడకల ఆసుపత్రిలో అన్ని రకాల రోగులకు నిష్ణాతులైన ఆయుర్వేద వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత ఓపీ, ఐపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ టి.బల్లయ్య మాట్లాడుతూ, వందేళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఆయుర్వేద వైద్య విధానం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు, వ్యాధుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆసుపత్రి సీనియర్ వైద్యులు డా.లక్ష్మీ శుభద్ర, డా.భాగ్యలక్ష్మి, డా.డి.పద్మజ, వైద్యులు డా.మురళీ బాబు, డా.శేషన్న, డా.ఎం.లత, డా.కమల కుమారి, పీజీ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు తదితరులు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు నేషనల్ మెడికల్ అసోసియేషన్ మరియు శ్రీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం కమిటీ నిర్వాహకులు సహకరించారు. వారి సహకారానికి ఆసుపత్రి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం ప్రాధాన్యతను తెలియజేయడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా జంపని ఆస్తానాలో సేవా కార్యక్రమాలు

బాపట్ల, మహానగర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని జంపని గ్రామంలోని శ్రీ అతా మొహమ్మద్ నిజాముద్దీన్ షా బాబా ఆస్తానాలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ భాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు అందిస్తున్న సేవలను స్మరించుకుంటూ ఆయన ఆయురారోగ్యాలతో సంపూర్ణ ఆరోగ్యంతో దేశ సేవను కొనసాగించాలని ఆకాంక్షిస్తూ 'ఆశీర్వాద దీపం' వెలిగించారు. కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు చేయూతనందించే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గోధుమపిండి, బియ్యం తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం స్థానిక ప్రజలకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకలకు పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తూ పేదలు, విద్యార్థులకు తమ వంతు సహాయం అందించామని తెలిపారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం, పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ద్వారా సామాజిక సేవకు ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఐటీ సహ కన్వీనర్ రాఖీబ్ అహ్మద్, బాపట్ల జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు యాకత్ అలీ బేగ్, మైనారిటీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

- పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ
- ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేత
- స్థానిక ప్రజలకు భోజన వసతి ఏర్పాటు



మహిళా క్రికెట్‌కు ప్రోత్సాహం





- ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్ని
- విజయవాడ నుంచి మంగళగిరి వరకు బైక్ ర్యాలీ.. పాల్గొన్న 100 మంది బైకర్లు
- ఫ్రాంచైజీ విధానంలో తొలిసారిగా మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్
- కడప, విశాఖపట్నంలోనూ భవిష్యత్‌లో పోటీలు నిర్వహిస్తాం

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

మహిళా క్రికెట్‌కు మరింత ప్రోత్సాహం అందించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నిర్వహించడం పట్ల గర్వంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లుగానే క్రికెట్‌లోనూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పోటీలకు మద్దతు కూడగట్టేందుకు గురువారం నగరంలోని నోవోటల్ నుంచి మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియం వరకు సుమారు 100 మంది బైకర్లతో 'బైక్స్ అండ్ బ్యాట్స్--ఉమెన్ ఆన్ వీల్స్' పేరుతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ట్రోఫీని ప్రత్యేక వాహనంలో స్టేడియానికి తరలించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ఏసీఏ తరఫున ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఫ్రాంచైజీ విధానం లేకుండా మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నిర్వహించామని, ప్రస్తుతం తొలిసారిగా ఫ్రాంచైజీ విధానంలో లీగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతిభ ఉన్న పేద, ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారిణులకు మెరుగైన అవకాశాలు, ఆర్థిక సహాయం అందించేందుకు ఫ్రాంచైజీ విధానం దోహదపడుతుందని తెలిపారు. మహిళా క్రికెటర్లకు పోటీ వాతావరణం, గుర్తింపు, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించడమే లీగ్ ప్రధాన లక్ష్యమన్నారు. మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో పగలు, రాత్రి మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నాలుగు జట్లు పోటీపడుతున్నాయని, భవిష్యత్‌లో లీగ్‌ను మరింత విస్తరించి కడప, విశాఖపట్నం వంటి నగరాల్లోనూ పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. మహిళా క్రికెట్‌కు ఏసీఏ అండగా నిలుస్తుందని, ప్రతిభావంతులైన క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ మహిళా క్రికెట్ మ్యాచ్‌లకు ప్రేక్షకుల ఆదరణ తక్కువగా ఉందని నిరుత్సాహపడకుండా, తమ ఆటతో ప్రజలను ఆకట్టుకున్న ఘనత భారత మహిళా క్రికెటర్లదని అన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మహిళలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పిస్తోందని తెలిపారు. భారత క్రికెట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి మరింత మంది మహిళలు ప్రాతినిధ్యం వహించాలనే ఉద్దేశంతో మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా క్రికెటర్లను గోదావరి, అమరావతి, వైజాగ్, రాయలసీమ జట్లుగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏసీఏ ఆధ్వర్యంలో మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మహిళా క్రీడాకారిణులకు మంచి వేదికగా నిలుస్తుందని, ఇందులో ప్రతిభ కనబరిచే వారికి భారత జట్టు తరఫున కూడా అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జట్లలో కొంతమంది భారత క్రీడాకారిణులు కూడా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఏ క్రికెట్ కార్యకలాపాల డైరెక్టర్ కళ్యాణ్ కృష్ణ, ముఖ్య కార్యనిర్వహణ అధికారి జై కిషన్, ఏసీఏ సిబ్బంది, బైకర్లు, క్రికెట్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న కూటమి ప్రభుత్వం

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

కేబీఎన్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి.. ప్రశ్నలకు ఎంపీ సూటి సమాధానాలు



విజయవాడ, మహానగర్

మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సూచించారు. గురువారం నగరంలోని కేబీఎన్ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్య తదితర అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు. విద్యార్థులు తమ సమస్యలు, భవిష్యత్తుపై ఉన్న సందేహాలను స్వేచ్ఛగా ఎంపీ దృష్టికి తీసుకురాగా, ప్రతి ప్రశ్నను శ్రద్ధగా విన్న కేశినేని చిన్ని ఆయా అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి విద్యతో పాటు నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని ఆయన అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు కొత్త విషయాలను నిరంతరం నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి తనకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, నైపుణ్యాలను పెంపొందించడం, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు విద్యార్థులను సిద్ధం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యా వ్యవస్థలో చేపడుతున్న మార్పులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల్లోని విషయాలకే పరిమితం కాకుండా, ప్రస్తుత ప్రపంచ అవసరాలకు అనుగుణంగా జ్ఞానం, నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డిగ్రీలతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో విద్యా రంగంలో మరిన్ని మార్పులు, ఆధునిక విధానాలు అందుబాటులోకి రానున్నాయని, ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. విద్యార్థులు కూడా మార్పును స్వీకరించి, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించడం ద్వారా వారి ఆలోచనలు, ఆశయాలు, సమస్యలను తెలుసుకునే అవకాశం కలిగిందని కేశినేని చిన్ని తెలిపారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. "నేటి విద్యార్థులే రేపటి సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి. వారికి నాణ్యమైన విద్య, సరైన మార్గదర్శకత్వం, అవసరమైన నైపుణ్యాలు అందితే భవిష్యత్తులో అద్భుతమైన ఫలితాలు సాధించగలరు" అని అన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం..
హెల్త్ కార్డుల వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు

- అక్టోబర్ 1 నుంచి నిధుల లభ్యత.. పెండింగ్ వైద్య బిల్లుల చెల్లింపులకు ప్రాధాన్యం
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ వేతనం అమలు చేయాలి
- 32 ప్రధాన డిమాండ్లపై అధికారులతో ఫలప్రదంగా చర్చలు
- ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్



అమరావతి, మహానగర్

ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, హెల్త్ కార్డుల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రాబోయే రెండు, మూడు నెలల్లో సమగ్ర చర్యలు చేపట్టనున్నట్లు ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో జరిగిన సంయుక్త స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ తరఫున విద్యాసాగర్‌తో పాటు రాష్ట్ర కార్యదర్శి డి.వి. రమణ పాల్గొన్నారు. హెల్త్ కార్డుల వ్యవస్థకు సంబంధించి ఉద్యోగుల నుంచి వసూలు చేసే మొత్తంతో పాటు ప్రభుత్వం అందించే మ్యాచింగ్ గ్రాంట్‌ను ఎలాంటి మధ్యంతర ఆటంకాలు లేకుండా నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమ చేసేలా ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు అక్టోబర్ నుంచి చర్యలు ప్రారంభమవుతాయని విద్యాసాగర్ తెలిపారు. అక్టోబర్ 1 నుంచి నిధులు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఆసుపత్రుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు, హెల్త్ కార్డుల పరిమితి పెంపు వంటి అంశాలపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా హెల్త్ కార్డుల వ్యవస్థలోని సమస్యలను సమగ్రంగా సమీక్షించి పరిష్కరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. సీపీఎస్ పరిధిలోని పదవీ విరమణ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డుల సౌకర్యం కల్పించాలని కోరారు. చికిత్స అనంతరం ఉద్యోగులు సమర్పించిన వైద్య బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించి, పెండింగ్ బిల్లులను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లు ట్రెజరీ ద్వారా నేరుగా వైద్య రీయింబర్స్‌మెంట్ బిల్లులు చేసుకునేలా ఉత్తర్వులు జారీ అయినందున, అందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా త్వరగా విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. అనేక యాప్‌లలో వివిధ రకాల సర్వేలు, వివరాలను నమోదు చేయాల్సి రావడంతో ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా సమావేశంలో ప్రస్తావించారు. వివిధ సర్వేలు, సేవలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా ఒకే యాప్‌లో సమీకరించే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీఓ సంఘం, ఏపీ జేఏసీ తరఫున హెల్త్ కార్డులతో పాటు వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ కేడర్ల పదోన్నతులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వేతనాలు, బదిలీలు, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ అప్‌గ్రేడేషన్, ఎఫ్‌టీఏల మంజూరు తదితర 32 ప్రధాన డిమాండ్లపై అధికారులతో చర్చలు ఫలప్రదంగా జరిగాయని తెలిపారు. సుమారు 3,500 మంది వైద్య శాఖ కాంట్రాక్ట్ సిబ్బందికి 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేసిందని, ప్రస్తుతం అమలు దశలో ఉందని చెప్పారు. మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని వర్తింపజేయాలని కోరినట్లు తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్ట్ సిబ్బందికి బదిలీల సౌకర్యం కల్పించే ప్రతిపాదనను అధికారులు ప్రభుత్వ పరిశీలనకు పంపినట్లు వెల్లడించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ 100 శాతం పే స్కేల్ పరిధిలోకి తీసుకువచ్చి, నియామకం జరిగిన నాటి నుంచి ఉన్న వేతన వ్యత్యాసాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో 2014కు ముందు నియమితులైన ఉద్యోగుల క్రమబద్ధీకరణ పూర్తయిందని, 2014 తర్వాత నియమితులై క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులను కోరినట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జీవో 143, 32 ఉత్తర్వుల అమలులో ఉన్న ఇబ్బందులను అధిగమించి వైద్య శాఖలో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందిస్తున్నారని, సమావేశంలో చర్చించిన అంశాలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని ఉద్యోగులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు విద్యాసాగర్ తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాప ప్రసాద్, ఎస్టీయూ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయ రాజ్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు కృష్ణయ్య, పెన్షనర్ల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నర్సుల సంఘం అధ్యక్షురాలు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ప్రాధాన్యతపై చైతన్యం అవసరం - ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ



కోట, మహాసగర్

తల్లీబిడ్డలు ఆరోగ్యంగా జీవించేందుకు, చిన్నారులు పుష్టిగా ఎదిగేందుకు పోషకాహార ప్రాధాన్యతపై గ్రామీణ ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందని కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కృష్ణమ్మ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని తిమ్మనాయుడుపాళెం అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, ఖనిజాలు, నీరు తదితర పోషకాలను సరైన మోతాదులో తీసుకోవడం అవసరమన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, యువత తమ శారీరక అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు తదితర ఆహార పదార్థాల వల్ల కలిగే ప్రయోజనాలను బొమ్మల ద్వారా వివరించారు. చిన్నారులకు ఒకేసారి ఎక్కువ ఆహారం ఇవ్వకుండా తక్కువ మోతాదులో ఎక్కువసార్లు ఆహారం అందించేలా అలవాటు చేయాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు చిన్నారుల ఆహారపు అలవాట్లను తెలుసుకుని అవసరమైన మార్పులు, సూచనలు చేస్తున్నారని తెలిపారు. రాగులు, సజ్జలు, జొన్నలు తదితర తృణధాన్యాలతో వివిధ రకాల పోషక పదార్థాలను తయారు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కళ్యాణి, పద్మ, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

సినిమా రిలీజ్ తర్వాత జడల్ అని పిలుస్తారు



'ప్రేక్షకులకు గొప్ప మాస్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా 'ది ప్యారడైజ్'. ఈ సినిమా ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ నెల 24న చూస్తారు. చాలా స్ట్రాంగ్ ఎమోషన్స్‌తో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ సినిమా తీశారు. నా గత చిత్రాలకు తమిళ ప్రేక్షకులు మంచి సపోర్ట్ ఇచ్చారు. నా కెరీర్‌లో ఇంత కష్టపడ్డ సినిమా లేదు. కచ్చితంగా ఈ సినిమా కూడా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఇప్పుడు మీరంతా నన్ను 'నాని' అని పిలుస్తున్నారు. రేపు ఈ సినిమా విడుదలయ్యాక అంతా 'జడల్' అని పిలుస్తారు. సుబ్బుగా చేసిన కయాదు లోహర్, కీర్తి సురేశ్ క్యామియో.. అనిరుధ్ సంగీతం ఈ సినిమాను నెక్స్ట్ లెవల్లో నిలబెట్టాయి' అని అగ్ర కథానాయకుడు నాని అన్నారు. ఆయన హీరోగా రూపొందిన పీరియడ్ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్'. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ప్రత్యేక పాత్ర పోషించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చెరుకూరి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా పానిండియా స్థాయిలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం చెన్నైలో నిర్వహించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడారు. ప్యారడైజ్ ఓ రెవల్యూషనరీ ఫిల్మ్ అని, నాని ఇందులో రెబల్‌గా కనిపిస్తారని, తన ప్రాంతం కోసం, ఉనికి కోసం, ప్రజల కోసం , తల్లి కోసం తను ఎలా పోరాడాడు అనేది ఇందులో ప్రధానాంశమని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల అన్నారు. ఈ సినిమాను తమిళంలో విడుదల చేస్తున్న స్వరూప్ కూడా మాట్లాడారు.



పవర్‌ఫుల్ పోలీస్ ప్రేమ్‌రాజ్

అగ్ర కథానాయకుడు సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'సీన్'. జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఝుగారం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై జ్యోతిక, సూర్య నిర్మిస్తున్నారు. దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో డీఎస్‌పీ ప్రేమ్‌రాజ్‌గా శక్తివంతమైన పాత్రలో కనిపించారు సూర్య. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కమాండింగ్ బాడీ లాంగ్వేజ్, పంచ్‌లతో కూడిన సంభాషణలతో సూర్య తనదైన మేనరిజమ్స్‌తో ఆకట్టుకున్నారు. నజ్రియా నజీమ్, ఆనంద్‌రాజ్, లాల్, రాజ్‌ప్రియాన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



మహేశ్‌బాబుతో భన్సాలీ సినిమా?

అగ్ర హీరో మహేశ్‌బాబుతో ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారా? అంటే ఔననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సంజయ్‌లీలా భన్సాలీ ఇటీవలే మహేశ్‌బాబుని కలిసి కథ చెప్పారని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. భన్సాలీ శైలి భారీ సెట్లు, గ్రాండ్ విజువల్స్, బలమైన భావోద్వేగాలతో సాగే పీరియాడిక్ కథ ఇదని ప్రచారం జరుగుతున్నది. గతంలో కూడా అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి అగ్ర హీరోలతో సంజయ్‌లీలా భన్సాలీ సినిమా చేయొచ్చనే వార్తలొచ్చాయి. అయితే ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు-భన్సాలీ ప్రాజెక్ట్‌పై జరుగుతున్న ప్రచారం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం మహేశ్‌బాబు 'వారణాసి'పైనే తన దృష్టిని కేంద్రీకరించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇక సంజయ్‌లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' చిత్రం జనవరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ రెండు చిత్రాలు పూర్తయ్యాకే మహేష్‌బాబు-సంజయ్‌లీలా భన్సాలీ సినిమాపై స్పష్టత వస్తుందంటున్నారు.

వేవేల ఊహలే చూపినా..



టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, విష్ణు తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ చిత్రం 'బా బా బ్లాక్‌షీప్'. గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వేణు దోనెపూడి నిర్మిస్తున్నారు. అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల ఈ సినిమా నుంచి 'వేవేల ఊహలే చూపినా...' పాటను అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఎలక్ట్రానిక్ కిలి, ఆర్మాడో సంగీతాన్నందించిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. మేఘాలయా రాష్ట్రంలోనే మొత్తం చిత్రీకరణ జరిపామని, ఇంట్రెస్టింగ్ క్రైమ్ ఎలిమెంట్ నేపథ్యంలో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు.

సంక్రాంతికి వచ్చేది కాకానే.. మరి విశ్వంభర పరిస్థితేంటి?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా వస్తోన్న మూవీ కాగా. ఈ సినిమాకు బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సత్యం అనే పాత్రలో చిరు నటిస్తున్నారు. వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ తేదీని అఫీషియల్‌గా ప్రకటించారు మేకర్స్. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగనుంది. అయితే చిరంజీవి నటించిన మరో మూవీ విశ్వంభర. ఈ ఏడాదిలోనే రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం ఇప్పటి వరకు విడుదలకు నోచుకోలేదు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో నిలపాలని మేకర్స్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ముందుగానే డేట్ ప్రకటించిన కాకా వాయిదా పడనుందనే టాక్ వినిపించింది. దీంతో కాకా నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. కాకా విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. వచ్చే సంక్రాంతి కానుకగా జనవరి 13న రిలీజ్ చేస్తామని అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ త్వరలోనే విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. దీంతో కాకా వాయిదా పడుతుందన్న వార్తలకు చెక్‌పడింది. మరి విశ్వంభర రిలీజ్ ఎప్పుడనేది క్లారిటీ రావాల్సి ఉంది. కాగా.. ఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేతా పేతురాజ్, సునీల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999